నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 25-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:96 పేజీలు: 4 వెల: రూ.1/-

బిజెపికి అవకాశం ఇస్తే హైదరాబాద్‌ను కూడా అమ్ముతారు

అబద్దాల ప్రచారంలో వారు గోబెల్స్‌ను మించారు
అన్ని వర్గాలను వంచించిన బిజెపిపై చార్జిషీట్ వేయాలి
ఉద్యోగాల హామీతో మోసం చేసినందుకు నిరుద్యోగులు నిలదీయాలి
-మీడియా సమావేశంలో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): మతతత్వాన్ని, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించే బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ కేంద్ర మంత్రులంతా ప్రశంసించి.. ఎన్నికల వేళ ఛార్జిషీట్ అంటూ బీజేపీ కేంద్ర మంత్రి జవడేకర్ అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. హైదరాబాద్‌కు కేంద్రం ఏ చేసిందో సూటిగా సుత్తి లేకుండా చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఏం చేశామో చెప్పే ఓటర్లను ఓటు అడుగుతున్నామని బీజేపీ ఆ దమ్ముందా అన్ని ప్రశ్నించారు. బీజేపీకి అధికారమిస్తే హైదరాబాద్‌ను గుండుగుత్తాగా అమ్మేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేసి ప్రైవేట్‌పరం చేస్తుందని మండిపడ్డారు. ఆరేండ్ల స్వల్ప వ్యవధిలో తెలంగాణ రాష్ట్రాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రగతి పథంలో నిలిపిందని మంత్రి కేటీఆర్ అన్నారు.

మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని హామీలంటూ బీజేపీ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై మంత్రి కేటీఆర్ కౌంటర్ ఇచ్చాడు. బీజేపీ నేతలు గోబెల్స్ కజిన్స్‌లా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం మంత్రులు సైతం అస్యతాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కష్టాలను తీర్చినందుకా టీఆర్ఎస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ విడుదల చేశారని బీజేపీ నేతలను ప్రశ్నించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రైతుబంధు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఇంటింటికి మంచి నీళ్లు, వేలాది గురుకులాలు పెట్టి పేద విద్యార్థులను చదివిస్తున్నందుకే టీఆర్ఎస్‌పై చార్జ్‌షీట్ విడుదల చేశారా? అని బీజేపీ నేతలను నిలదీశారు. దేశంలో ఎక్కడలేని విదంగా 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణాయే అన్నారు. తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రమని కేంద్రమంత్రులు చెప్పారని గుర్తుచేశారు. అన్నింటినీ ప్రైవేట్‌పరం చేయడమే బీజేపీ పాలసీ అని విమర్శించారు. రైల్వే రంగాన్ని ఎందకు ప్రైవేటీకరణ చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి అవకాశం ఇస్తే హైదరాబాద్‌ను కూడా అమ్మేస్తారని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకు బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అందువల్ల ప్రజలు బిజెపిపై ఛార్జిషీటు వేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ ఎందుకు ఛార్జిషీటు వేసిందో ఆ పార్టీ నాయకులకే తెలియదని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం నెంబర్ వన్‌గా గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కోటిన్నర ఎకరాలకు నీరందించాం. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నాం. రైతు భీమా పథకంతో రైతుల్లో భరోసా నింపాం. వృద్ధులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తున్నాం. యేటా రూ. 50 వేల కోట్లు సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం. కేసీఆర్ కిట్టుతో మతా శిశు మరణాలు తగ్గించాం. పవర్ హాలిడేస్‌ను ఎత్తివేశాం. పరిశ్రమలకు బాగు చేశాం. రాష్ట్రానికి వేల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం. లక్షలాది మంది యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పిస్తున్నాం. ఇందుకు ఛార్జిషీటు వేస్తారా అంటూ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీరుపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఏ దేశ భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్ముతున్నారని ప్రశ్నించారు. రైల్వేను ప్రైవేట్ పరం చేస్తున్నారని, రైల్వే ఉద్యోగుల పొట్టగొడుతున్నారని మండిపడ్డారు. అదేవిధంగా దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసీని అమ్మకానికి పెట్టారని విమర్శించారు. బీజేపీ పాలసీ పెట్టుబడుల ఉపసంహరణ అని ఎద్దేవా చేశారు. వీళ్లకు అవకాశం ఇస్తే... చార్మినార్, గోల్కొండలను కూడా అమ్మేస్తారని సెటైర్ వేశారు. బీజేపీతో జాగ్రత్త అని హెచ్చరించారు. ఛార్జిషీట్లు వెయ్యాల్సి వస్తే... ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్న బీజేపీ పై వెయ్యాలన్నారు. ఆరేళ్లలో 12 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని, ఐటీఐఆర్ రద్దు చేశారని, పేదవారి పొట్టకొట్టింది కేంద్రమేనన్నారు. ఇస్తానన్న ఉద్యోగాలు లేవని.. నోట్లరద్దు, లాక్‌డౌన్ లాంటి అయోమయ విధానాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. బీజేపీ దివాళా కోరు విధానాలే వీటన్నిటికీ కారణమన్నారు. మొత్తంగా భారతీయ జనతాపార్టీ భారతదేశాన్ని అమ్మేస్తోందని కేటీఆర్ విమర్శించారు. భారతదేశంలో ముస్లింలపై భాజపాకు ఎంత విద్వేషం ఉందో అందరికీ అర్థమవుతోందన్నారు. లోయర్ సీలేరును తీసుకెళ్లి ఏపీలో కలిపింది భాజపా కాదా?అని ప్రశ్నించారు. ఇటీవల తెరాసపై ఛార్జిషీట్ విడుదల చేసిన భాజపాకు కేటీఆర్‌కు 50 ప్రశ్నలు సంధించారు. పేకాట క్లబ్‌లు మూసివేయించినందుకా మాపై ఛార్జిషీట్? లక్షల మంది చిరు వ్యాపారుల పొట్టగొట్టారు.. వారు భాజపాపై ఛార్జిషీట్ వేయాలి. కరోనా సమయంలో చనిపోయిన వలస కార్మికుల ఆత్మలు ఛార్జిషీట్ వేయాలి. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడుతున్నందుకు భాజపాపై రైతులు ఛార్జిషీట్ వేయాలి. పెట్టు బడుల ఉపసంహరణ దేశ భవిష్యత్ కోసమా.. గుజరాత్ పెద్దల కోసమా? ఆరేళ్ల లో హైదరాబాద్‌కు భాజపా ఏం చేసిందో చెప్పగలరా? అని కెటిఆర్ ఘాటు ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఈ సారి కూడా మేమే తొలి స్థానంలో ఉంటాం.. రెండో స్థానంలో మజ్లీస్ ఉంటుంది అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రగతిభవన్ కట్టుకున్న కెసిఆర్ డబుల్ ఇళ్లను మాత్రం కట్టలేదు

దుబ్బాక తరహాలోనే గ్రేటర్‌లోనూ గెలుస్తాం
మల్కాజిగిరి ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): నాలుగు నెలల్లో సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ కట్టుకున్నాడు గానీ ఆరేళ్లు గడుస్తున్నా ప్రజలకు డబుల్ బెడ్రూమ్స్ కట్టివ్వలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజలను మభ్య పెడుతూ సొంత ప్రయోజనాలు పొందుతున్న సిఎం కెసిఆర్ వరదలతో ప్రజలు చస్తున్నా ప్రగతిభవన్‌కే పరిమితం అయ్యారని అన్నారు. దుబ్బాకలో మాదిరి గ్రేటర్‌లోనూ గెలుస్తామని అన్నారు. మల్కాజ్‌గిరిలో బీజేపీ నిర్వహించిన గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ హామీలు నిలబెట్టుకోకపోవడం గురించి ఆయన ప్రస్తావించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కిషన్ రెడ్డి కోరారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమకు ఓటు వేస్తే డబుల్ బెడ్ రూమ్స్ కట్టిస్తామని కేసీఆర్ అన్నారు. కానీ ఇప్పటివరకు ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదు. నాలుగు నెలల్లో కేసీఆర్ ప్రగతి భవన్ కట్టుకున్నారు కానీ, 6 సంవత్సరాలు అవుతున్నా సామాన్య జనాలకు మాత్రం డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదు. టీఆర్ఎస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయి. కానీ పనులు ప్రగతి భవన్‌ను దాటడం లేదు. ప్రభుత్వం వరద బాధితులకు రూ.10 వేలు ఇస్తే వెనుక నుంచి టీఆర్ఎస్ నాయకులు రూ.5 వేలు తీసుకున్నారు. 40 మంది చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా కేసీఆర్ పరామర్శించలేదు. ఈ ఎన్నికల్లో డబ్బులతో గెలవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. దుబ్బాకలో గెలిచినట్టు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గెలుస్తాం. కల్వకుంట్ల కుటుంబం, ఓవైసీ కుటుంబ పాలన పోవాలి. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయం. ఈ ఎన్నికల తర్వాత కేటీఆర్ అమెరికాకు పోవడం ఖాయం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

26న గొగోయ్ అంత్యక్రియలు

ప్రజల సందర్శనార్థం ఇంటికి భౌతిక కాయం

గౌహతి,నవంబర్24(ఆర్ఎన్ఎ): అసోం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ అంత్యక్రియలు ఈనెల 26న జరుగుతాయని అసోం ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి భూపెన్ బోర తెలిపారు.

కోవిడ్ పాజిటివ్ అనంతరం తలెత్తిన పలు ఆరోగ్య సమస్యలతో గువాహతి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తరుణ్ గొగోయ్ సోమవారం రాత్రి కన్నుమూశారు.

ఆయన పార్థివ దేహాన్ని మంగళవాయం ఉదయం ఆయన నివాసం వద్ద ప్రజాసందర్శనార్థం ఉంచారు. దీంతో తమ ప్రియతమ నాయకుని కడసారి చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు.

'గొగోయ్ పార్థివ దేహాన్ని ఇంటి నుంచి రాజీవ్ భవన్ కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకువెళ్తాం. ఆ తర్వాత అసోం సెక్రటేరియట్, స్టేట్ అసెంబ్లీ వద్ద కూడా ప్రజాసందర్శనార్థం ఉంచుతాం.

26వ తేదీన అంతక్రియలు జరుగుతాయి' అని బోర తెలిపారు. 84 ఏళ్ల గొగోయ్ మూడు సార్లు అసోం ముఖ్యమంత్రిగా పనిచేశారు. పలుమార్లు ఎంపీగా కేంద్రంలోనూ పదవులు చేపట్టారు.

చరిత్రలో నేటినిజం

కో॥ నవరియుగములోనిపింతలు
భవిష్యత్తుమ లోన జరుగు పలువిషయములనే
ప్రవిమల కాలజ్ఞానగ
ప్రవచించగ- గోలుతు - "వీరబ్రహ్మము"గారినే!!

(నవంబర్ 25 పోతులూరి వీరబ్రహ్మంగారి జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210



పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి



తిరుపతి,నవంబర్24(ఆర్ఎన్ఎ): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఇవాళ ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు.

రాష్ట్రపతి వెంట రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఉన్నారు. తిరుమల పర్యటనలో భాగంగా ఉదయం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయన పద్మావతి అమ్మవారి దర్శనార్థం తిరుచానూరు ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతి దంపతులకు టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జెఈవో పి.బసంత్‌కుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చక బృందంతో కలిసి ఇస్కిలఫాల్ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వస్త్రం, తీర్థప్రసాదాలను వారికి చైర్మన్ అందించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ భరత్ నారాయణ గుప్తా, ఇంటెలిజెన్స్ ఐజి శశిధర్ రెడ్డి, టిటిడి సివిఎస్‌వో గోపినాథ్ జెట్టి, తిరుపతి అర్బన్ ఎస్పీ రమేష్‌రెడ్డి, అదనపు సివిఎస్ వో శివకుమార్‌రెడ్డి, విజివో మనోహర్, డిప్యూటీ ఈవో ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసుకోండి..

సీఎంలను కోరిన మోదీ

హైదరాబాద్:, నవంబర్ 24 శాస్త్రీయ ప్రమాణాలతో సురక్షితంగా ఉన్న కరోనా టీకాను మాత్రమే దేశ ప్రజలకు ఇవ్వనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. వ్యాక్సిన్ భద్రతతో పాటు వేగం కూడా ప్రాముఖ్యమైందని, వ్యాక్సిన్ పంపిణీ విధానానికి అన్ని రాష్ట్రాల సహకారంతో కార్యాచరణ రూపొందిస్తున్నామని ప్రధాని మోదీ చెప్పారు. ఇవాళ 8 రాష్ట్రాల సీఎంలతో జరిగిన వర్చువల్ సమావేశాన్ని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు టీకాలను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని మోదీ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కరోనా వ్యాక్సిన్ అభివృద్ధిపై జరుగుతున్న అన్ని అంశాలను ట్రాక్ చేస్తున్నామని, భారతీయ టీకా అభివృద్ధిదారులు, ఉత్పత్తిదారులతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నామని, ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ రెగ్యులేటర్లతోనూ టచ్‌లో ఉన్నామని, ఇతర దేశ ప్రభుత్వాలతో, బహుళజాతి సంస్థలతో, అంతర్జాతీయ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

ప్రస్తుతం టీకా అభివృద్ధి జరుగుతున్నా.. ఆ టీకాలు ఎన్ని డోసులు ఉంటాయో తెలియవని, కరోనా టీకా ఒక డోసా లేక రెండు డోసులా లేక మూడు డోసుల్లో వస్తుందా ఇప్పుడే చెప్పలేమని ప్రధాని మోదీ అన్నారు. కరోనా వ్యాక్సిన్‌కు ఇంకా ధరను కూడా నిర్ధారించలేదన్నారు. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ఇంకా సమాధానం లేదని, కానీ వ్యాక్సిన్ పంపిణీకి కావాల్సిన కార్యాచరణ మాత్రం రూపొందిస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. వ్యాక్సిన్ నిల్వల కోసం కోల్డ్ స్టోరేజ్‌లను రాష్ట్ర ప్రభుత్వాలే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అతి సూక్ష్మస్థాయిలోనూ ఎలా వ్యాక్సిన్ పంపిణీ చేపడుతారో.. రాష్ట్ర ప్రభుత్వాలు తమ పూర్తి ప్రణాళికలను పంపించాలని సీఎంలను ప్రధాని కోరారు. మీరు అనుభవపూర్వకంగా ఇచ్చే అమూల్యమైన అభిప్రాయాలు.. తాము నిర్ణయం తీసుకోవడంలో దోహదపడుతుందని మోదీ అన్నారు. ప్రో యాక్టివ్ భాగస్వామ్యాన్ని స్వాగతిస్తామన్నారు. టీకా అభివృద్ధి ప్రక్రియ జరుగుతుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిర్లక్ష్యం వహించరాదు అని సీఎంలను మోదీ కోరారు.

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు: తండ్రీకొడుకుల మృతి

వరంగల్,నవంబర్24(ఆర్ఎన్ఎ): హన్మకొండ నక్కలగుట్టలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నక్కల గుట్ట వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తున్న తండ్రీ కొడుకులు మృతి చెందారు. మృతులను అంబేద్కర్ నగర్ కు చెందిన సంజీవ్ అతని కుమారుడు రూపేష్‌గా గుర్తించారు. విషయం

తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు. తండ్రి, కొడుకు మరణించడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

పలు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని మోదీ చర్చ
ఢిల్లీలో పరిస్థితులను వివరించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో.. ప్రధాని మోదీ మంగళవారం రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహించారు. కరోనా విజృంభణ తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను వారితో చర్చించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దేశరాజధానిలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను వివరించారు. నవంబర్ 10వ తేదీన రాష్ట్రంలో అత్యధికంగా 8600 కేసులు పెరిగినట్లు తెలిపారు. ఆ తర్వాత నాటి నుంచి క్రమంగా పాజిటివ్ కేసుల సంఖ్య తగ్గుతున్నట్లు చెప్పారు. మూడవ వేవ్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, కాలుష్యం ప్రధానంగా మారిందన్నారు. ఢిల్లీ పరిసర రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను కాలుస్తున్న సంఘటనలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని సీఎం కేజీ కోరారు. అయితే కరోనా వైరస్ మూడవ వేవ్ వెళ్లేంత వరకు రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ హాస్పిటళ్లలో సుమారు వెయ్యి ఐసీయూ మంచాలను ఏర్పాటు చేయాలని ప్రధానిని సీఎం కేజీ కోరారు. చత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ భగల్ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల పండుగ సీజన్ తర్వాత దేశంలో పలు ప్రాంతాల్లో కోవిడ్ కేసులు పెరిగాయి. దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు 91 లక్షలు దాటాయి. గత 24 గంటల్లో 37,975 కొత్త కేసులు సంక్రమించాయి.

బిజెపిలో చేరుతానన్న కత్తి కార్తీక

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): బిగ్‌బాస్ ఫేమ్, కార్తీక గ్రూప్ చైర్మన్ కత్తి కార్తీక బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ప్రధాన మంత్రి మోదీ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితురాలై తాను త్వరలో బీజేపీలో చేరుతున్నట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొననున్నట్టు తెలిపారు. బీజేపీ మహిళలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నిర్మలా సీతారామన్‌ను ఆర్థి మంత్రిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తాను బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు ఆమె తెలిపారు.

నివర్ తుఫాన్‌పై ప్రధాని మోడీ ఆరా

తమిళనాడు, పాండీ సిఎంలతో చర్చ
కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): నివర్ తుఫాన్ నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి ముఖ్యమంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఉదయం ఫోనులో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. అవసరమైన కేంద్ర సాయానికి భరోసా ఇచ్చారు. ప్రధాని ఓ ట్వీట్‌లో ఈ విషయాన్ని తెలియజేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామితోనూ, పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామితో పరిస్థితి గురించి తెలుసుకున్నానని, కేంద్రం నుంచి ఎలాంటి సాయానికైనా సిద్ధమని చెప్పడం జరిగిందని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్టు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

మామల్లాపురం-కారైకాల్ మధ్య నివర్ తుఫాన్ మంగళవారం మధ్యాహ్నానికి తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్టు ఐఎండీ అంచనా వేస్తోంది. తీరం దాటే సమయంలో గంటలకు 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికాలు స్పష్టం చేస్తున్నారు. దీంతో తీర ప్రాంత జిల్లాల్లో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. కాగా, ముందస్తు జాగ్రత్తగా తమిళనాడు తీరంలో రెండు కోస్ట్ గార్డ్ నౌకలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు.

నివర్ తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు తమిళనాడు, పుదుచ్చేరిలో 30 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహ రించారు. 12 బృందాలను ఇప్పటికే అందుబాటులో ఉంచగా, 18 టీమ్‌లను రిజర్వ్‌లో ఉంచామని ఎన్‌డీఆర్ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు న్యూఢిల్లీలో తెలిపారు. సముద్రం కల్లోలంగా ఉన్నందున మత్స్య కారులు చేపల వేటకు వెళ్లవద్దని విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తమిళనాడు సీఎం ఒక ప్రకటనలో కోరారు. కాగా, 11 జిల్లాల్లో బస్సు సర్వీసులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సస్పెండ్ చేశారు. కాగా, వర్షాలు పడతాయని అంచనా వేస్తున్న ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, కీలకమైన డాక్యుమెంట్లను జాగ్రత్త చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నివర్ తుపాను దూసుకువస్తుండటాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, తొమ్మిది రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 24-25 తేదీల్లో చెన్నై ఎగ్మోర్-పాండిచ్చేరి మధ్య భువనేశ్వర్-పుదుచ్చేరి-భువనేశ్వరి రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 25న పుదుచ్చేరి-విల్లుపురం మధ్య పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను పాక్షికంగా రద్దు చేసినట్టు తెలిపింది.

కాంగ్రెస్, బీజేపీ కుయుక్తులు పనిచేయవు

గ్రేటర్ ప్రచారంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపును ఆపలేరని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గ్రేటర్ ప్రచారంలో భాగంగా మంత్రి బంజారా హిల్స్ డివిజన్‌లోని ఎన్బీటీ నగర్‌లో పాద యాత్ర నిర్వహించారు.

టీఆర్ఎస్ కార్పొరేట ర్ అభ్యర్థి గద్వాల్ విజయలక్ష్మి, అల్లోల దివ్యారెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ టీఆర్ఎస్ కే ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీల బూటకపు మాటలను నమ్మే స్థితిలో గ్రేటర్ ప్రజలు లేరని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా అభివృద్ధి చేస్తున్నామని, హైదరాబాద్ లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, ఎంతో మంది ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా మహా నగరంలో చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బంజారాహిల్స్ డివిజన్ టీఆర్ఎస్ అభ్యర్థి గద్వాల్ విజయలక్ష్మి గతంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని ఈసారి కూడా ప్రజలు ఆశీర్వదించి ఆమెను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజల సమస్యలపై టీఆర్ఎస్‌కు ఉన్న పట్టింపు మరే ఇతర పార్టీలకు లేదని చెప్పారు. నీటి పన్ను రద్దు చేయడంతో పాటు సెలూన్లు, దోబీ ఘాట్లు, లాండ్రీలకు ఉచిత కరెంట్ ఇస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేకుర్చే నిర్ణయం తీసుకుందన్నారు.

తిరుపతి చేరుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఘనంగా స్వాగతం పలికిన గవర్నర్, సిఎం

తిరుపతి,నవంబర్24(ఆర్ఎన్ఎ): తిరుపతికి చేరుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి రేణిగుంట చేరుకున్నారు.

ఈ సందర్భంగా విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తదితరులు రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్రపతి, గవర్నర్ కలిసి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి బయలు దేరి వెళ్లారు. ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్ ఉండటంతో సీఎం జగన్ గన్నవరం విమానాశ్రయానికి బయలు దేరి వెళ్లారు. రాష్ట్రపతి పర్యటనలో గరవ్నర్, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

2023 వరకు కరోనా సమిసి పోయే ఛాన్స్

టీకాలతో ఏడాదిపాటు మాత్రమే రక్షణ
ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): కరోనా టీకాలకు సంబంధించి వరుస పెట్టి శుభవార్తలు వెలువడుతున్న నేపథ్యంలో టీకా ప్రభావశీలతపై ఎయిమ్స్ డైరెక్టర్ డా. రణదీప్ గులేరియా స్పందించారు. కరోనా టీకాలతో కనీసం ఏడాది పాటు వైరస్ నుంచి రక్షణ లభిస్తుందని ఆయన తెలిపారు. కనీసం తొమ్మిది నెలల నుంచి ఏడాది ప

వరద ఆపదలో ఎన్నికలు అవసరమా?

నేటినిజం
బుధవారం 25-11-2020

మూడు నెలల ముందే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు ఎందుకన్న ప్రశ్నకు ఇప్పటికీ అధికార టిఆర్ఎస్ సమాధానం చెప్పడం లేదు. అలాగే వరద బాధితులను ఆదుకునే క్రమంలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రజలను కష్టాల్లోకి నెట్టి ఇప్పుడే ఎందుకు ఎన్నికలు జరపాల్సి ఉందని ప్రజల్లో ప్రశ్నలు బయలు దేరాయి. ఇకపోతే వరదబాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని, వరదసాయం అందించలేదని తాజా ఘటనలు చూస్తుంటే అర్థం అవుతోంది. గ్రేటర్ ప్రచారంలో అనేక ప్రాంతాల్లో అధికార టిఆర్ఎస్ కార్పోరేటర్లకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ప్రచారానికి వచ్చిన నేతలను నిలదీస్తున్నారు. ఈ దశలో బిజెపిని నిందిస్తూ ప్రజల్లోకి వెళ్లడం ఓ రకంగా టిఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోనే పడేసింది. నిజానికి వరద సమయాల్లో యుద్ధప్రాతిదికన టిఆర్ఎస్ రంగంలోకి దిగి, నీళ్లలో నిండా మునిగిన ప్రజలను ఆదుకుని ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. బిజెపికి మాట్లాడే అవకాశం వచ్చేది కాదు. ప్రచారంలో వారు విమర్శలకు దిగే వారు కాదు. ఇకపోతే వరదల నుంచి ప్రజలను కాపాడడం అన్నది తక్షణ కర్తవ్యం. దానికి ఎంత ఖర్చయినా వెనకాడరాదు. కానీ టిఆర్ఎస్ నేతలతో పాటు..కెసిఆర్ కూడా పదేపదే ఎన్నడూ లేనంతగా వరదలు వచ్చాయని సర్దిచెప్పడం సరికాదు. వరదలు ఒక్క హైదరాబాద్‌లోనే రాలేదని.. ముంబై, చెన్నై, న్యూఢిల్లీ, అహ్మదాబాద్‌ల్లో కూడా వచ్చాయని, ఎక్కడా కుటుంబానికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకోలేదని చెప్పడం ప్రజలకు ఆగ్రహం కలిగించేదే. వరదల సమస్యను దేశంలోని అన్ని ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్నాయని చెప్పడం ఎంతవరకు భావ్యమో ఆలోచించి ఉంటే బాగుండేది. ఓదార్చాల్సిన సమయంలో ఇలాంటి మాటలు సరికాదు. ఇకపోతే ఎవరు అడక్కపోయినా పదివేల సాయం ప్రకటించానని అన్నారు. ఇచ్చిన పదివేల సాయం అందలేదు. ఎందుకు అందలేదో చెప్పలేదు.

అలాగే ఎన్నికలు పూర్తయ్యాక కొత్త కార్పొరేటర్లు, మేయర్ సారథ్యంలో పారదర్శకంగా పంపిణీ చేపడతామని చెప్పడం మభ్యపెట్టడం తప్ప మరోటి కాదు. గతంలో వర్షాలకు చెన్నై 21 రోజులు, ముంబై 14 రోజులపాటు నీటిలోనే ఉంది. ఢిల్లీ, కోల్‌కతాలోనూ ఈ సమస్య ఉంది. దీనికి శాశ్వత పరిష్కారం కావాలని కోరుతూ గతంలో కేంద్రానికి కొన్ని సూచనలు చేశామని అన్నారు. కేంద్రం ఎలాంటి కమిటీ వేయలేదు. సాయం చేయలేదని సమస్యను, బాధను కేంద్రంపై రుద్దారు. మూసీని పునరుద్ధరిస్తామని, మూసీని, గోదావరిని అనుసంధానం చేస్తామని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు. పడవలో షికార్ చేసేలా మూసీని తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇది సాధ్యమా అన్నది ప్రజలు ఆలోచిస్తారు. నిజానికి బాధల్లో ఉన్న వారికి ఈ వచనాలు స్వాంతన కలిగిస్తాయా అన్నది ఆలోచించి ఉంటే బాగుండేది. హైదరాబాద్ వరదల్లో కనీసం బయటకు వచ్చి పరిశీలించకపోవడం కూడా ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంది. మొన్నటి వరదల్లో నగరంలో పేదలు, దిగువ మధ్యతరగతి, మధ్య తరగతి, చిన్న చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు తాగునీరు ఉచితంగా అంది స్తామని చెప్పిన కేసిఆర్.. వారు బాధల్లో ఉంటే గుక్కెడు నీళ్లు అందిచేందుకు ముందుకు రాలేదు. ఇకపోతే తెలంగాణ ప్రజలు దేనినయినా నమ్ముతారు కానీ దొరహంకారాన్ని సహించరు. తెలంగాణ విమోచనం కూడా దొరహంకారానికి వ్యతిరేకంగా సాగిందే. ఇవన్నీ తెలిసిన సిఎం కెసిఆర్ నేలవిడిచి సాము చేస్తున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల ముంగిట ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ వరాలు ప్రకటించడం ప్రజలకు నమ్మిక కలిగిస్తుందా లేదా అన్నది చూడాలి. నెలకు 20 వేల లీటర్ల కంటే తక్కువ తాగునీరు వినియోగించే నగరవాసులు డిసెంబరు నుంచినీటి బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ప్రకటించారు. జంట నగరాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70 వేల నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు, రజకుల ధోబీఘాట్ల

కు కూడా ఉచిత విద్యుత్తు అందిస్తామన్నారు. కరోనా లాక్‌డౌన్ కాలంలో 6 నెలలపాటు రవాణా వాహనాల మోటారు వాహన పన్నును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కరోనాతో నష్టపోయిన వ్యాపార వర్గాలకు 6 నెలల కనీస డిమాండ్ విద్యుత్తు చార్జీలను కూడా రద్దు చేస్తామన్నారు. సినీ కార్మికులకు రేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు అందిస్తామని, చిన్న థియేటర్లు కూడా ఎక్కువ షోలు వేసుకునేలా, సినిమా టికెట్ల ధరలు పెంచుకునేలా వెసులు బాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్య మంత్రి కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా అలవికాని హామీలను ప్రకటించారు. నిజానికి ఉద్యమ నేతకు ఇవన్నీ అవసరం లేదు. తాను గిరిగీసుకుని ప్రజలకు దూరంగా ఉంటూ రావడం వల్ల ప్రజలకు, కెసిఆర్‌కు మధ్యన గ్యాప్ పెరిగింది. జంటనగరాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులకు 60-70వేల సెలూన్లు ఉన్నాయి. అన్నిటికీ వందశాతం ఉచిత విద్యుత్తు అందిస్తా మని గతంలోనే చెప్పారు. కానీ అది అమలు కాలేదు. అలాగే, జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా లాండ్రీలు, ధోబీఘాట్‌లకు వాడే విద్యుత్తును కూడా డిసెంబరు నుంచి ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఇవన్నీ గతంలో ప్రకటించినా అమలు చేయడంలో ఆసల్యం జరిగింది. వారు ఎన్నోమార్లు మొర పెట్టు కున్నారు. నిజానికి ఇచ్చిన హామీలు చకచకా అమలు చేయడం ముఖ్యం. నిజానికి ఏదైనా సమస్యను చెప్పుకునే అవకాశం ప్రజలకు రావడం లేదు. అంటే కెసిఆర్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నది ప్రజల్లో బాగా నాటుకుంది. దీనిని అధిగమించే ప్రయత్నాలు చేయడం లేదు. మెట్రో 2వ విడతను త్వరలో పూర్తి చేస్తామని, ఎయిర్‌పోర్ట్ వరకు విస్తరిస్తామని వివరించారు. శివారుల్లోని హెచ్ఎండీఏ ప్రాంతాలను కలుపు కొంటే నగర జనాభా 1.67 కోట్లుగా ఉందని, ఈ రద్దీని తట్టుకునేలా రీజనల్ రింగ్ రోడ్‌ను ప్రతిపాదించామని వివరించారు. గత ఆరేళ్లలో దేశం సాధించలేని అద్భుతమైన ప్రగతిని సాధించామని చెప్పారు. అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిన తెలంగాణలో సామరస్యాన్ని, శాంతిపూర్వక వాతావరణాన్ని కాపాడు కోవాలన్నారు. నిజానికి హామీల విషయంలో నగరంలో అనేక వైఫల్యాలు ఉన్నాయి. ప్రధానంగా రోడ్ల నిర్వహణ గతంలో ఎప్పుడూ ఇంత అధ్వాన్నంగా లేదు. వరదలు వస్తే ఇతర నగరాల్లోనూ వచ్చాయని చెప్పకుండా మనమెలా చేశామో చేసిచూపితే బాగుండేది. సమస్యలన్నీ సమిసి పోయేదాకా ఎన్నికలు జరపాల్సిన అసవరం లేదు. కేవలం రాజకీయ కోణంలో మాత్రమే ఎన్నికలకు వెళ్లారు తప్ప మరోటి కాదు. ఇలాంటి సమయంలో ప్రజలు ఎలా స్పందిస్తారన్న గ్రేటర్ ఫలితాలను బట్టి తెలుసుకోవచ్చు.

రైతు వేదికలను ప్రారంభించడానికి త్వరితగతిన సిద్ధం చేయాలి..!

- సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు .

సంగారెడ్డి, నవంబర్ 24 (నేటినిజం ప్రతినిధి) సోమవారం ఝరాసంగం మండలం ఏ డాకుల పల్లి , జీర్లపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న రైతు వేదిక పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులలో వేగం పెంచాలని , జాప్యానికి తావివ్వ కూడదని అన్నారు. అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. చిత్తశుద్ధితో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ ,సంబంధిత కాంట్రాక్టర్ ,తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలో వర్షంతో దాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..!!

-జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంగారెడ్డి , నవంబర్ 24 (నేటినిజం ప్రతినిధి)జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వర్షంతో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఆ మేరకు సోమవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈనెల 25 ,26 తేదీలలో తుఫాన్ వచ్చే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్ దిశా, నిర్దేశం చేశారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసి న ధాన్యం నిల్వ ఉంచ రాదన్నారు. రైతుల ట్రాక్టర్ల లో కూడా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని తెలిపారు. టన్నుకు రూ.180/- లు రవాణా చార్జీలను చెల్లిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆయా కేంద్రాలలో గుంతలు ఉన్న ప్రాంతంలో ధాన్యం పోయకుండా చూడాలన్నారు. మార్కెట్ కమిటీ ఇచ్చే టార్పాలిన్లు సరిపో నందున, రైతులు కొనుగోలు కేంద్రాలకు తగు టార్పాలిన్ లతో రావాలని, వర్షంతో తడవకుండా ధాన్యం కుప్పలకు టార్పాలిన్లు కప్పు కోవాలని సూచించారు.

రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని, ధాన్యాన్ని తమ తమ కల్లాల్లోనే ఆరబెట్టుకుని, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి అనుమతితో కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.వర్షం సమయంలో కొనుగోలు కేంద్రాలకు దాన్యం రాకను నియంత్రించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా కొనుగోలు చేసిన ధాన్యం వర్షానికి తడిసినట్లయితే సంబంధిత కేంద్రం ఇన్చార్జి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలకులుగా నియమించిన ఆయా మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను సందర్శించి, వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత ఐ కె పి డి పి యం , సహకార శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి కొనుగోలు కేంద్రాలలో తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు.

ధాన్యం కొనుగోలుకు గోనె సంచుల కొరత రాకుండా, ఇండెంట్ వచ్చిన ఆరు గంటలలో గా కేంద్రాలకు గోనెసంచులు పంపాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి సూచించారు. సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో గోనె సంచుల కొరత లేకుండా పర్యవేక్షించారు సూచించారు.

రైస్ మిల్లర్లు లారీలలోని ధాన్యాన్ని వెంటనే దించుకునేలా తగినంతమంది హమాలీలను నియమించుకోవాలని, ధాన్యం నిల్వ చేయుటకు శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్యాబ్ లో వెంటనే నమోదు చేసేలా సంబంధిత అధికారులు చూడాలని తెలిపారు.

జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రతిరోజు రైస్ మిల్లుల యాజమాన్యంతో మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని, అదేవిధంగా వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోరారు.ధాన్యం కొనుగోలు కేంద్రం లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్ట ర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు ఆదేశించారు సోమవారం సదాశివపేట మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత కొనుగోలు కేంద్రం ఇన్చార్జి ,మార్కెటింగ్ అధికారులతో రోజు ఎంత ధాన్యం కొనుగోలు చేస్తున్నారు, మిల్లులకు మొత్తం వెళుతుందా , గోనెసంచులు సరిపడినన్ని ఉన్నాయా ,ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అన్న వివరాలను ఆరా తీశారు.

కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు కొరత లేకుండా చూసుకోవాలని చెప్పారు. తుఫాన్ సూచనలు ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సంబంధితులకు సూచించారు. రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం లో ఏమైనా ఇబ్బందులు ఎదురు అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని, వర్ష సూచనలు ఉన్నందున, ధాన్యం తడవకుండా తీసుకురావాలని సూచించారు.

'నిర్భయ'ల రక్షణ గాల్లో దీపమేనా..!

(25 నవంబర్ "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" సందర్భంగా)

ప్రకృతిలో స్త్రీ పురుషులు సర్వసమాన సగభాగలే అయినప్పటికి, స్త్రీజాతిని ద్వితీయ శ్రేణి పౌరులుగా లింగ వివక్షతో అణిచి వేస్తూ, వారి పట్ల చులకన భావనలు, వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, బాలికలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, అక్రమ రవాణ, రేప్‌లు, భ్రూణహత్యలు, గృహ హింస, బాలకార్మికులు అన్ని దేశాల్లో సర్వసాధారణ సమస్యలే అయినాయి. ప్రపంచవ్యాప్తంగా 35 శాతం మహిళలు తమ జీవితకాలంలో ఏదో ఒక రకమైన లైంగిక వేధింపులను అనుభవిస్తున్నారని, వీరిలో 40 శాతం అబలలు వేధింపుల నుండి సహాయాన్ని కోరుతున్నారని, 10 శాతం మాత్రమే స్త్రీలు మాత్రమే న్యాయం కోసం చట్టాన్ని ఆస్రయిస్తున్నారని తేలింది. మహిళలపై అత్యాచారాలు జరిగినపుడు జనావేశం క్షణాల్లో పొంగడం, వ్యతిరేక గళాలు మిన్నంటడం, రెండు రోజుల తరువాత అన్ని మరిచి పాత కథలు పునరావృతం కావడం సర్వసాధారణం అయ్యింది. ప్రతి రోజు ఏదో ఒక మూలన మహిళ మానభంగ మౌన రోధన గొంతు దాటడం లేదు, విని స్పందించేందుకు బదులు ఎగతాళి, ప్రతి దశలో అవమానాలు మరియు చిన్నచూపు చూసే సమాజం మనది. ఐరాస వివరాల ప్రకారం మానవ అక్రమ రవాణాలో 71 శాతం మహిళలు మరియు బాలికలే ఉన్నారని అంచనా. వివాహిత మహిళల్లో 52 శాతం మాత్రమే కొంత స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రేప్ కేసులు నమోదైన దేశాల జాబితాలో (లక్ష మందిలో) దక్షిణ ఆఫ్రికా (132.4), బోత్సవానా (92.9), స్వీడెన్ (63.5), గ్రనెడా (30.6), అమెరికాలో (27.3) లాంటి దేశాలు అగ్ర భాగాన ఉన్నాయి. అమెరికాలో 9 శాతం రేపిస్టులపై విచారణలు జరుగగా, 3 శాతం మాత్రమే శిక్షలు అనుభవిస్తూ, 97 శాతం రేపిస్టులు స్వేచ్ఛగా బయట హీరోల్లా తిరుగుతున్నారు. వాస్తవానికి మహిళలలపై జరిగే అధిక అత్యాచార కేసులు బయట పడడం లేదు. సమాజ చులకన భావం ఎదుర్కోవలసి వస్తుందని, మహిళ భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందనే కారణాలతో, వారికి జరిగిన అన్యాయాన్ని సహిస్తూ దుర్భర బతుకులు ఈడ్చుతున్నారు. కోవిడ్-19 విజృంభన తరువాత వచ్చిన సామాజిక మార్పుల కారణంగా కూడా మహిళలపై గృహ హింస వేధింపులు పెరిగాయని తేలింది. ప్రపంచ మహిళాలోకంపై జరుగుతున్న అత్యాచారాలు, హింసాత్మక పోకడలను గమనించిన ఐరాస సభ్యదేశాలు 2000 నుంచి ప్రతియేటా 25 నవంబర్ రోజున 'అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం' పాటించుట జరుగుతోంది. 25 నవంబర్ 1960న డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ముగ్గురు బిరాబల్ సిస్టర్స్ హత్యకు నిరసనగా ఈ రోజును పాటిస్తున్నారు. యునెస్కో ఈ సంవత్సర నినాదంగా "మహిళా హింసకు 'నో' చెబుదాం" అంశాన్ని తీసుకున్నారు. ఐక్యతతో మహిళా హింసను అడ్డుకోవాలనే లక్ష్యంతో 25 నవంబర్ నుండి 10 డిసెంబర్ వరకు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజుల కార్యక్రమాలను ఐరాస చేపడుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా మానభంగాల రేటులో 120 దేశాల్లో భారత్ 95వ స్థానంలో ఉంది. భారత్‌లో నిర్భయలు, దిశలు, హత్రాస్‌లు ఎన్ని జరిగినా హడావుడులు మరియు క్షణికావేశాలు ప్రదర్శించడం తప్ప ఊహించి మార్పులు రావడం లేదు. ఇండియాలో రేప్‌ల రేటు 4.2 శాతం (ఒక లక్షలో) ఉండగా, చండీఘర్ 20.7 శాతం, రాజస్థాన్ 15.9 శాతం, ఢిల్లీ 13.5 శాతం, కేరళ 11.1 శాతం, హర్యానా 10.9 శాతం, అస్సాం 10.5 శాతం, హిమాచల్ 10.0 శాతంతో ముందు ఉండగా గుజరాత్ 1.6 శాతం, కర్నాటక 1.6 శాతం, తమిళనాడు 1.0 శాతం, నాగాలాండ్ 0.8 శాతంతో చివరన ఉన్నాయి. ఈ జాబితాలో తెలంగాణ 4.7 శాతం మరియు ఆంధ్రప్రదేశ్ 4.2 శాతం రేప్ రేటు నమోదు అయినాయి. మన దేశంలో ప్రతి 16 నిమిషాలకు ఒక రేప్ కేస్ బయట పడడం అత్యంత అవమానకరం. 2019లో దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 1,253 కేసుల సంఖ్య మరియు జైపూర్‌లో అధిక రేప్ రేటు నమోదైనాయి. గత పది సంవత్సరాల్లో దేశంలోని 66 శాతం రేప్ కేసులు రాజస్థాన్, యంపీ, కేరళ, యూపీ, మహారాష్ట్ర, అస్సాం, హర్యానా, ఝార్ఖండ్, ఒడిసా మరియు ఢిల్లీ రాష్ట్రాలలో జరిగాయి. ఈ రాష్ట్రాల్లో గత 10 సంవత్సరాల్లో రేప్ కేసులు రెట్టింపు కాగా మిగిలిన 26 రాష్ట్రాల్లో మానభంగ కేసులు పెరగలేదని తేలింది. ఈ రాష్ట్రాల్లో గత దశాబ్దకాలంలో రేప్ కేసులు నాలుగు రెట్లు పెరగడం విచారకరం. 2019లో జరిగిన రేప్ కేసుల్లో 16.2 శాతం దళిత మహిళలు మరియు 83.8 శాతం ఇతర వర్గాల మహిళలు ఉన్నారని తెలుస్తున్నది.

హూమన్ రైట్స్ వాచ్ నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతియేటా భారత్‌లో 7,200 మైనర్ బాలికలు (ఒక లక్షలో 1.6) రేప్‌కు గురుకావడం జాతికి సిగ్రు చేటుగా గమనించాలి. మైనర్ బాలికల రేప్ కేసుల తరువాత వారిని అక్రమ మానవ రవాణా ద్వారా జీవితకాలం వ్యభిచార నరక కూపంలోకి నెట్టబడడం కూడా జరుగుతున్నది. భారతదేశంలో నమోదైన రేప్ కేసులలో 27.8 శాతం (నలుగురు రేపిస్టుల్లో ఒక్కరు) నిందితులకు మాత్రమే ఆలస్యంగానైనా శిక్షలు పడుతున్నాయి. దేశ జనావేశం కట్టలు తెంచుకున్న ఢిల్లీ నిర్భయ కేసులోనే నిందితులకు శిక్ష పడడానికి ఆరు సంవత్సరాలకు పైగా సమయం పట్టడం దురదృష్టకరం. ఈ ఆలస్యానికి కారణం పోలీస్ యంత్రాంగమని న్యాయ వ్యవస్థ వేలు చూపితే, న్యాయ వ్యవస్థ, నిందితులు, భాదితులే ఆలస్యానికి బాధ్యులని పోలీసులు అనడం సర్వ సాధారణం అయ్యింది. న్యాయం ఆలస్యంగా అందితే, న్యాయం అందనట్లే అని అందరం భావించాలి. 16 నుంచి 24 ఏండ్ల యువతులు అధిక శాతం మానభంగానికి గురి అవుతున్నట్లు తేలింది. రేప్ చేసిన మానవ మృగాల్లలో 70 శాతం భాదితురాలికి తెలిసిన వారే ఉన్నారని గమనించాలి. విద్యావంతులు మరియు నాగరికత తెలిసిన పెద్దలు ఎక్కువగా ఉన్న ఢిల్లీ మరియు ఛండీఘర్ మహానగరాల్లో మానభంగాలు ఎక్కువగా నమోదుకావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సహజంగా మదమెక్కిన మానవ మృగాలు బలహీన అతివలపై చేసే అత్యాచారమే మానభంగ దుర్మార్గం. రేపిస్టులకు వెంటనే శిక్షలు పడేలా న్యాయ మరియు పోలీస్ వ్యవస్థలు కాల పరిధిలో చర్యలు తీసుకోవాలి. మానభంగం తరువాత హత్య చేయడం పరిపాటి అయ్యింది. ఇలాంటి క్రూరులకు వెంటనే ఉరి శిక్ష పడడమే ఏకైక మార్గం. నేటి తల్లితండ్రులు తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలి. యూనివర్సిటీల డిగ్రీల కన్న మానవీయ విలువలే ప్రధానమని, చదువు కన్న సంస్కారమే మిన్నయని గుర్తించాల్సిన సమయమిది. ప్రతి అమ్మాయి భారతమాత ముద్దు బిడ్డగా పూజించబడాలి. నేటి అమ్మాయిలు అవసరమైతే సబలలుగా మారి, మృగాళ్ల మదాన్ని అణిచే అపరకాళిగా గర్జించాలి. స్త్రీలో లక్ష్మి, సరస్వతి మరియు దుర్గలను దర్శించే నాగరిక భారత సమాజాన్ని నిర్మించే మహాయజ్ఞంలో మనందరం భాగస్వాములం అవుదాం. భరతమాతకు ప్రణమిల్లుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పార్టీ కార్యాలయాలకు నిబంధనలు: సజ్జన్నార్

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): గ్రేటర్ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఆయా పార్టీల అభ్యర్థులను గెలిపించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. ఈసందర్భంగా టీఆర్ఎస్, కాంగ్రెస్, బిజేపీ ఇతరపార్టీలు ఎన్నికల ప్రచార కార్యాలయాలను ఏర్పాటుచేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో పార్టీ కార్యాలయాలు కనీసం 100 మీటర్ల పరిధిలో ఒకటి కంటే ఎక్కువ ఏర్పాటు చేయరాదని ఆయా పార్టీలను సైబరాబాద్ కమిషనర్ విసి సజ్జనార్ ఆదేశించారు. ఒక పార్టీల కార్యాలయాల ఏర్పాటుకు కనీసం 100 మీటర్ల దూరం పాటించాలని అన్నారు. శాంతి భద్రతల నేపథ్యంలో ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆదేశాలు డిసెంబరు 6వ తేదీ వరకూ అమలులో ఉంటాయని అన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు అండగా ఉంటాం
వారి సమస్యలను పరిష్కరిస్తాం: తలసాని

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): నగర సమగ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమని తెలంగాణ రికగ్నైజ్ డ్ పాటశాలల అసోసియేషన్ హైదరాబాద్ నగర అధ్యక్షులు ఉమా మహేశ్వర్ రావు అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లో పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను అసోసియేషన్ సభ్యులు కలిసి జీహెచ్ఎంసి ఎన్నికల లో టీఆర్ఎస్ పార్టీకి తమ మద్దతు ప్రకటించారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నా, హైదరాబాద్ నగరం అభివృద్ధి జరగాలన్నా అది ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నే పరిష్కారం అయ్యాయని చెప్పారు. ఇంకా పెండింగ్ లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తారనే నమ్మకం తమకు ముఖ్యమంత్రి కేసీఆర్ మున్సిపల్ మంత్రి కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వం పై ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. తమకు ఏ సమస్య వచ్చినా మంత్రి తలసాని పెద్దదిక్కుగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ...అభివృద్ధికోసం పని చేసే టీఆర్ఎస్ పార్టీ ని గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు ప్రకటించారు. కొన్ని పార్టీల నేతలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు ఓట్లకోసం వస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం నిరంతరం ప్రజల మద్యనే ఉంటారని గుర్తుచేశారు.

మాయమాటలతో మభ్యపెట్టే పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓట్ల తో వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రికగ్నైజ్ డ్ పాటశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్, కోశాదికారి రఘు, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రశాంత్, సభ్యులు అల్తాఫ్, నరసింహా రెడ్డి తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే జీహెచ్ఎంసి ఎన్నికల లో భాగంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం సాయంత్రం పలు ప్రాంతాలలో టీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేట డివిజన్ ఐడిహెచ్ కాలనీలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ అభ్యర్థి కుర్మ హేమలత కు మద్దతు గా ఇంచార్జి దుర్గం చిన్నయ్యతో కలిసి ప్రచారం జరిపారు. జీహెచ్ఎంసి ఎన్నికల మేనిఫెస్టోలో పేదలకు అనేక వరాలు కురిపించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని రాంనగర్ లో అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డికి మద్దతు గా మంత్రి తలసాని ఎంఎల్ఏ ముఠా గోపాల్ తో కలిసి ప్రచారం నిర్వహించారు.

తమిళనాడులోని పుదుకొట్టెలో 1398మంది దివ్యాంగులకు సహాయక పరికరాల ఉచిత పంపిణీ

హైదరాబాద్,నవంబర్24దివ్యాంగులకు అవసరమైన తోడ్పడే పరికరాల ఉచిత పంపిణీ కోసం తమిళనాడులో నిర్వహించిన ఎడిఐపి శిబిరాన్ని సామాజిక న్యాయం, సాధికారత మంత్రి తావర్‌చంద్ గెహ్లోట్ మంగళవారం దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించనున్నారు. పుదుకొట్టెలో మొత్తం 1398 మంది దివ్యాంగులకు శ్రవణ, ఇతర సహాయ పరికరాలనుఈ సందర్భంగా అందించనున్నారు. ఈ కార్యక్రమానికి తూర్పు తిరుచిరాపల్లి నియోజకవర్గ పార్లమెంటు సభ్యుడు, తమిళనాడు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్. సి. విజయ

గ్రేటర్ ఎన్నికల ప్రచారానికి కదిలిన ఎంఐఎం దండు

-25 వాహనాల్లో 100 మంది తరలివెళ్లిన నాయకులు
-గ్రేటర్ ఎన్నికల్లో ఎంఐఎం గెలుపే లక్ష్యంగా శ్రమిస్తాం
-ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్ నవంబర్ 24(నేటినిజం ప్రతినిధి):గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 50కి పైచిలుకు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా శ్రమిస్తామని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ స్పష్టం చేశారు. మంగళవారం ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి గులాం అహ్మద్ హుస్సేన్ నాయకత్వంలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, సిరిసిల్ల, పెద్దపల్లి, రామగుండం నుంచి ముఖ్య నాయకులు 25 వాహనాల్లో 100 మంది తరలి వెళ్లారు. అహ్మద్ హుస్సేన్ జెండా ఊపి వాహనాల కాన్వాయ్ ను ప్రారంభించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తమ అధినేత అసదుద్దీన్ ఆదేశాల మేరకు 5 రోజుల పాటు కార్వాన్, నాంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎంఐఎం గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎంఐఎం పార్టీ పూర్తిస్థాయి భాగస్వామ్యం ఉన్నదనే విషయాన్ని గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు మర్చిపోలేదు కాబట్టే ఇప్పటికి గత 40 సంవత్సరాల నుంచి ఎంఐఎంను అక్కడి ప్రజలు ఆదరిస్తున్నారు చెప్పారు.ఈ విషయాన్ని టిఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గ్రహించి మరి ఎంఐఎం పై విషం కక్కుతున్నాయని చెప్పారు. 50కి పైగా స్థానాల్లో ఎంఐఎం గెలుస్తుందని మేయర్ ఎంపికలో ఎంఐఎం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎంఐఎం మత ప్రాతి పదికన ఏర్పడ్డ పార్టీ కాదనీ పక్కా సెక్యులర్ భావజాలం పునికిపుచుకున్న పార్టీ అని ఇది దేశ వ్యాప్తంగా త్వరలో నిరూపించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమమాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు బర్కత్ అలీ, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, ఆతిన, అలిబాబా, అజహర్ దబీర్, జగిత్యాల అధ్యక్షుడు యునూస్ నదీమ్, కోరుట్ల అధ్యక్షుడు సాబీర్, మెట్ పల్లి అధ్యక్షుడు అఖీల్, పెద్దపల్లి అధ్యక్షులు హాబీబుల్లా మస్రత్,సిరిసిల్ల అధ్యక్షుడు ముస్తఫా తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న టాస్క్ఫోర్స్ పోలీసులు

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 21 (నేటినిజం ప్రతినిధి): టాస్క్ ఫోర్స్ సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ బస్టాండ్ ఎదురుగా ఒక పాన్ షాప్ లో తనిఖీ చేయగా నిషేధిత గుట్కా లభ్యమైంది అందాజ దీని విలువ 12 వేల రూపాయల విలువ గలదు తగు చర్య నిమిత్తం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పాన్ షాప్ యజమాని దయ్యాల శ్రీనివాస్ మరియు నిషేధిత గుట్కా యుక్తంగా అప్పగించఅయినది.

అలాగే ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామం లో తల్లపల్లీ ఏల్లగౌడ్ యొక్క లక్ష్మి కిరాణం షాప్ లో తనిఖీ చేయగా నిషేధిత గుట్కా మరియు నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభ్యమైంది అందాజ దీని విలువ సుమారు 11వేల రూపాయల విలువ గలదు తగు చర్య నిమిత్తం ఎల్లారెడ్డి పేట పోలీస్ స్టేషన్లో షాప్ యజమాని తల్లపల్లి ఏళ్లగౌడ్ ను మరియు నిషేధిత గుట్కా మరియు నిషేధిత పొగాకు ఉత్పత్తులు యుక్తంగా అప్పగించఅయినది..

ఇట్టి దాడులలో టాస్క్ఫోర్స్ ఎస్సై రామ్ రెడ్డి, కానిస్టేబుల్ రమేష్ తిరుపతి బాబు, అక్బర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా టాస్క్ఫోర్స్ సి. ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు, అమ్మడం మరియు. ఇండ్లల్లో దాచిపెట్టడం నేరం మరియు గ్రామాలలో గుట్కా, మద్యం, ఎవరైనా అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. గ్రామాలలోని ప్రజలు మరి యువకులు ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 కు, స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు

రేణుక ఎల్లమ్మ ఆలయం ముఖద్వారం కమాన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ ,ఎం పి టి సి

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 21 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండల రుద్రవరం గ్రామంలో 5 వ నెంబర్ మెయిన్ రోడ్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ ఆలయం ముఖ్య ద్వారం కమాన్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ఉరడి రామ్ రెడ్డి,ఎం పి టి సి గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్ ,వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరి డి ప్రవీణ్ ను భూమి పూజ చేశారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్,విద్యా కమిటీ చైర్మన్ తునికి నరేష్, సహకార సంఘం డైరెక్టర్ వంకాయల రాజు ,మాజీ సర్పంచ్ పిల్లి రేణుకా కనకయ్య , వార్డు సభ్యులు, గౌడ సంఘం నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఓట్ల కోసం అధికార టిఆర్ఎస్ బెదిరింపులు

-గ్రేటర్లో సునామీ రాబోతోంది: మురళీధర్ రావు

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలను బెదరించిన అధికార టిఆర్ఎస్ ఓట్లు వేయించుకోవాలని చూస్తోందని బిజెపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మురళీధర్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంర్భంగా మాట్లాడుతూ.. '1948లో హైదరాబాద్‌ను పాకిస్తాన్లో కలపాలని ఎంఐఎం కోరింది. బిహార్ ఎన్నికల్లో గెలిచిన ఎంఐఎం ఎమ్మెల్యే.. హిందుస్తాన్ పేరుతో ప్రమాణ స్వీకారం చేయనని చెప్పారు. ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్.. పాత బస్తీలో ఓట్ కట్టారు పార్టీగా మారింది. ఢిల్లీ మున్సిపాలిటీలో 30 ఏళ్లుగా బీజేపీ గెలుస్తూ వస్తుంది. బీజేపీ గెలిచిన చోట ఎక్కడా మతవిద్వేషాలు లేవు. బీజేపీ చెప్పింది చేస్తుంది. హైదరాబాద్ ఎన్నికల్లో సునామీ రాబోతుంది. ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఉండదని అన్నారు

గ్రేటర్ ఎన్నికల్లోనే బిజెపిని ఎందుకు టార్గెట్ చేశారు

విపక్ష కాంగ్రెస్‌ను దెబ్బతీయడం కూడా చేటు తెచ్చిందా
టిఆర్ఎస్ వేస్తున్న అడుగులు బిజెపిని రెచ్చగొట్టేలా ఉన్నాయా
సిఎం కెసిఆర్ వ్యాఖ్యలపై ఇప్పుడు సర్వత్రా చర్చ

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో ఇప్పుడు బిజెపిని సిఎం కెసిఆర్ టార్గెట్ చేశారు . బిజెపి అస్తవ్యస్థ పాలన అందిస్తోందని విమర్శిస్తున్నారు. జాతీయ రాజకీయాల బూచి చూపితే బిజెపి భయపడుతుందనుకుంటున్నారో..లేక నిజంగానే ప్రత్యామ్నాయ రాజకీయాలపై సీరియస్‌గా దృష్టి సారించారో అన్నది రానున్న కాలంలో తేలనుంది. అయితే మొన్నటికి మొన్న పార్టీల నేతలతో భేటీలోనూ.. మ్యానిఫెస్టో విడుదల సందర్భంగానూ సిఎం కెసిఆర్ ప్రధానంగా బిజెపిని టార్గెట్ చేశారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ అట్టర్ ఫ్లాప్ అయిందని సీఎం కేసీఆర్ ఆరోపించారు.

మాటలు పెద్దగా చెబుతున్నారంటూ పరోక్షంగా మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగారు. పిట్ట కథలు చెప్పి ప్రభుత్వాలు నడుపు తున్నారు. దేశానికి దిశ, దశ, మార్గదర్శనం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమయ్యాయి. ఆ పార్టీల పాలసీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. దేశంలో కొత్త ప్రయోగం జరగాల్సిన అవసరం వందశాతం ఉంది. దేశంలో సంపద సృష్టించే ప్రభుత్వం రావాలి. ఆ సంపదను పేదలకు పంచాలి. దేశం కొత్త మార్గం, కొత్త పంథాలో వెళ్లాలి. ఆ ఆవిష్కర్తగా నేనే ఎదుగుతా కావొచ్చు. నాకు ఆ ఆలోచన ఉంది. త్వరలోనే మీరు చూస్తారు అని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు. నిజానికి గతంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సిఎం కెసిఆర్ ఇలాంటి ప్రకటే చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయాలు కోరుకుంటున్న లెఫ్ట్ తదితర పార్టీలు కూడా దీనిని స్వాగతించాయి. ఇదే వైఖరితో ముందుకు సాగివుంటే ఈ ఏడాదిన్న కాలంలో ప్రత్యామ్నాయంపై ఓ స్పష్టత వచ్చేది. కానీ కేవలం గ్రేటర్ ఎన్నికల ముందు మరోమారు ప్రకటించడం చూస్తే కేవలం ఎన్నికల ముందే బిజెపిని బూచిగా చూసి మైఆనర్టీ ఓట్లు దండుకునే యత్నాల్లో ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బిజెపి కూడా ఇదే విషయంలో ఆరోపణల చేస్తోంది. తెలంగాణలో పాలన చేయలేని వాడు ఢిల్లీలో ఏం చేస్తాడని ఎదురుదాడి చేస్తున్నారు.ఇకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వేరే వాళ్లు గెలిస్తే సాధించేదేమీ ఉండదని, హైదరాబాద్ అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలని కెసిఆర్ చెప్పారు. బిజెపితో నగరంలో మతకల్లోలాలు జరుగుతాయని పదేపదే పరోక్షంగా కెసిఆర్, కెటిఆర్‌లు హెచ్చరిస్తున్నారు. అలాగే కేవలం బిజెపినే టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. లౌకిక నగరాన్ని మనమంతా కాపాడుకోవాలని, అలవోకగా, ఆషామాషీగా ఓటేస్తే.. మన వేలుతో మన కన్నే పొడుచుకున్నట్లు అవుతుందని కెసిఆర్ తాజాగా చేసిన హెచ్చరికుల చూస్తుంటే బిజెపి పట్ల వారు ఎంతగా ఆందోళనలగా ఉన్నారన్నది అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో మత కల్లోలాలు చెలరేగితే.. పిచ్చి పిచ్చి ఘటనలు జరిగితే రియల్ ఎస్టేట్ పందశాతం కుదేలవుతుందని, భూముల ధరలు పూర్తిగా పడిపోతాయని, హైదరాబాద్ మార్కెట్టే కుప్పకూలిపోతుందని వ్యాఖ్యానించడం వెనకా బిజెపి భయమే ఉన్నట్టు అర్థం చేసుకోవలి. తమాషాగా ఓటేస్తే.. ఆ ఓటు మనల్ని కాటేసే ప్రమాదం ఉంటుంది. తప్పుడు శక్తులు, వ్యక్తులకు ఓటేస్తే అది కాలనాగు అవుతుంది. చాలా జాగ్రత్త. ఆలోచించి ఓటు వేయండని కెసిఆర్ హితవు పలికారు. శాంతి భద్రతల విషయంలో హైదరాబాద్ గొప్పగా ఉంది. గత ఏడేళ్లుగా కర్ఫ్యూలు, కత్తిపోట్లు, మాఫియా మారాలు, భూకబ్జా గూండాల్లేరు. మహిళలపై దుర్మార్గాలు జరిగితే ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిం చిందో అందరికీ తెలిసిందే అని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోనూ మహిళా భద్రత విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, దుర్మార్గులను ఉక్కుపాదంతో అణిచి వేస్తామని తెలిపారు. మొన్న కెటిఆర్ కూడా ఇదే అన్నారు. ఇప్పుడు కెటిఆర్ అదే వ్యాఖ్యానించారు. దేశాన్ని సరైన మార్గంలో పెట్టడానికి తెలంగాణ బిడ్డగా.. జాతి ప్రయోజనాల కోసం ఏ త్యాగం చేసేనా సరే ముందుకు పోతానని మరోసారి ప్రకటించడం ద్వారా బిజెపికి హెచ్చరిక చేవారా అన్నది కూడా ఇక్కడ గమనించాలి. రాబోయే కొద్దికాలంలో దేశంలోని పార్టీలతో సమావేశం నిర్వహించి.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు యుద్ధభేరి మోగిస్తాం. కార్మికులారా.. మీరు ఒంటరని అనుకోకండి. మీపక్షాన కేసీఆర్ పోరాడుతాడు అని సీఎం కేసీఆర్ కార్మికవర్గాలకు భరోసా ఇచ్చారు. నిజానికి విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం ద్వారా అనవసరంగా ఇప్పుడు బిజెపికి ఎదిగే ఛాన్స్ ఇచ్చారు. కాంగ్రెస్‌ను దెబ్బతీయడమన్నది బిజెపి ఎదుగుదలకు కారణమవుతోందని గుర్తించలేదు. ఇకపోతే అనేకానేక కారణాలు పరిశీలిస్తే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్న విషయాన్ఇన గమనించిన బిజెపి దూసుకుని వస్తోంది. దుబ్బాకలో వచ్చిన ఫలితాన్ఇన ఆధారంగా చేసుకుని పాతుకుపోవాలని చూస్తోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా తనకు గిట్టనివారిపై విషం చిమ్ముతూ పోవడం వల్ల ఫలితం ఉండదు. గద్దర్ లాంటి వాళు కేసీఆర్‌ను ప్రశంసించడం చూస్తే అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. దీనివల్ల కెసిఆర్‌కు మైలేజీ పెరిగిందో లేదో కాని గద్దర్‌కు ఉన్న ప్రతిష్ట దిగజారింది. గోరటి వెంకన్న వంటి వారికి ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టితే ప్రజలంతా తనకు అనుకూలంగా ఉంటారనుకోవడం కూడా భ్రమే కాగలదు. ఈ నేపథ్యంలో ఆయన ఇప్పుడు బీజేపీపై యుద్ధం చేస్తాననీ, ప్రాంతీయ పార్టీలన్నింటినీ సమీకరిస్తాననీ చెప్పడం అనవసరంగా బిజెపిని రెచ్చగొట్టడం మినహా మరోటి కాదు.

వారసత్వ రాజకీయాలపై బిజెపి యుద్ధం

కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో ఇదే ముఖ్యం
ఇప్పుడు టిఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకూ వ్యూహం
గ్రేటర్ ఎన్నికల్లో బిజెపి వ్యూహాత్మక ప్రచారం

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): దేశంలో ప్రాంతీయ పార్టీలు, వారసత్వ రాజకీయాలు ఉండకూడ దన్నది బిజెపి లక్ష్యం. ఆ మేరకు ఆ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలను మెల్లగా కైవసం చేసుకుంటోంది. వారసత్వ రాజకీయాలు నడుపుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో చులకన చేయడమే గాకుండా స్థానం లేకుండా చేస్తోంది. అందులో తెలుగు రాష్ట్రాలు మినహా యింపు కాదు. అందుకు అనుగుణంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు వ్యూహాలు పన్నుతున్నారు. ఇప్పటికే ప్రధాని మోదీతో ఢీకొంటున్నవారంతా చతికిలపడు తున్నారు. అనేక ప్రాంతీయ పార్టీలను మోదీ,షా ద్వయం బలహీనపరచగలిగారు. తమ భాగస్వాములుగా ఉన్న ప్రాంతీయ పార్టీలను కూడా బీజేపీ వదిలిపెట్టడం లేదు. బిహార్‌లో నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూకు పడుతున్న గతే ఇందుకు నిదర్శనం. తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయాలని మోదీ,షా ద్వయం ఎప్పటి నుంచో తహతహలాడుతోంది. ఇప్పుడు జరుగుతున్న గ్రేటర్ ఎన్నికలలో దుబ్బాక తరహాలో అనూహ్య ఫలితాలు వస్తే తెలంగాణలో అధికారానికి పునాది పడుతుందని భావించి ప్రచారంలో ముందుకు సాగుతోంది. దుబ్బాక ఫలితం తరవాత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భారతీయ జనతా పార్టీ ఆగ్రహం పెరిగింది. గతంలో ప్రధాని నరేంద్ర మోదీని పొగుడుతూ వచ్చిన కేసీఆర్‌కు ఇప్పుడు హఠాత్తుగా ప్రధాని పైన, బీజేపీ పైన కోపం తారస్థాయికి చేరింది. రాష్ట్రంలో తన అధికారానికి బీజేపీ నుంచి సవాల్ ఎదురుకావడమే ఇందుకు కారణం కావచ్చు. అందుకే ఆ పార్టీకి వ్యతిరేకంగా యుద్ధం చేస్తానని, జాతీయస్థాయిలో బీజేపీ వ్యతిరేక పార్టీలను కూడగడతానని ప్రకటించారు. బీజేపీకి ఆయుధాలు అందిస్తూ రావడం వల్లనే గ్రేటర్ ఎన్నికలలో ఆడుతూ పాడుతూ విజయం సాధించాల్సిన టీఆర్ఎస్ ఇప్పుడు చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు మంత్రి కేటీఆర్ చెబుతున్న అభివృద్ధి ఫలాలు గ్రేటర్‌లో పేదలకు అందడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా సంపన్న వర్గాలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలనే చేపట్టారు. ఈ కారణంగా 2004లో జరిగిన ఎన్నికలలో ఆయన నమ్ముకున్న ప్రాంతాల ప్రజలు కూడా తెలుగుదేశం పార్టీని గెలిపించలేదు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ కూడా అదే దారిలో నడుస్తున్నారు. దుర్గం చెరువుపై నిర్మించిన తీగల వంతెన వంటివి అవసరమే కానీ, వాటివల్ల ఓట్లు రావు. కొన్ని కారణాల వల్ల అధికారంలో ఉన్నవారి పట్ల ప్రజల్లో మొహం మొత్తుతుంది. కాంగ్రెస్‌ను కోలుకోకుండా దెబ్బతీస్తూ వచ్చిన కేసీఆర్, ఇప్పుడు బీజేపీ నుంచి ముప్పు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఇప్పుడు బీజేపీపై యుద్ధం చేస్తాననీ, ప్రాంతీయ పార్టీలన్నింటినీ సమీకరిస్తాననీ చెబుతూ ఉండటం తెలివైన చర్యగా కనిపించడం లేదు.గతంలో చంద్రబాబు దేశమంతా కాలికి బలపం కట్టుకుని మమతా బెనర్జీ, మాయావతి, అఖిలేశ్ యాదవ్, స్టాలిన్, కేజీవ్రాల్, కుమారస్వామి వంటి ప్రాంతీయ పార్టీల నాయకులతో విడిగా సమావేశమయ్యారు. నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఉమ్మడి వేదికలు పంచుకున్నారు. దీంతో బీజేపీ ఆయనపై కక్ష పెంచుకుంది. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఓడిపోవడానికి తన వంతు పాత్ర పోషించింది. దుబ్బాక ఎన్నికలో బీజేపీ అనూహ్యంగా విజయం సాధించింది. ఈ పరిణామాన్ని ఊహించని కేసీఆర్ ఇప్పుడు బీజేపీపై విరుచుకుపడుతున్నారు. గ్రేటర్ ఎన్నికలలో కూడా బీజేపీ నుంచి సవాల్ ఎదురవుతుండడంతో బీజేపీపై యుద్ధం చేస్తానని ప్రకటించారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మహామహులంతా మకాం వేసి చెమటోడ్చినా కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. దీంతో ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. గ్రేటర్ ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి మరింత దిగజారినట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఫలితంగా తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కేసీఆర్ పాలనను, వ్యవహార శైలిని వ్యతిరేకిస్తున్న వారంతా బీజేపీకి జై కొడుతున్నారు. గ్రేటర్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో మార్పు రానుందన్న ప్రచారం కూడా సాగుతోంది. గ్రేటర్‌లో గత ఎన్నికలలో బీజేపీ నాలుగు డివిజన్లనే గెలుచుకుంది. ఈ పర్యాయం 40 డివిజన్లలో ఆ పార్టీ గెలిచే అవకాశం ఉందని సమాచారం. నిజానికి దుబ్బాక ఫలితం విశ్లేషించి విరుగుడు చర్యలపై దృష్టి సారించాల్సిన కేసీఆర్ ఇప్పుడు బీజేపీపై యుద్ధం చేస్తానంటూ కాలుదువ్వుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రేటర్ ఎన్నికలలో టీఆర్ఎస్‌కు ప్రధాన పోటీదారుగా బీజేపీ ఎదిగింది. దుబ్బాక తరహాలోనే టీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తమకు, మజ్లిస్ పార్టీకి పొత్తు లేదని మంత్రి కేటీఆర్ పదే పదే ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. గ్రేటర్ ఎన్నికల గురించి చర్చించడానికి మంత్రులు, పార్టీ ముఖ్యులతో కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశంలో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పాల్గొనడం గమనార్హం.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం అవుతున్న కార్మికులు

26న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపు

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): పారిశ్రామిక రంగంలో ఉన్న కార్మికులు, సేవల రంగంలో ఉన్న ఉద్యోగులు కనీస వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, ప్రభుత్వం రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అమ్మవద్దని ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వంలోని పెద్దలకు ఎన్నో వినతిపత్రాలు సమర్పించారు. కార్మికుల పట్ల ఈ వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ 2015, 2016, 2019, జనవరి 2020లో కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గన్నారు. అన్ని వైపుల నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతున్నా మోడీ ప్రభుత్వం ప్రస్తుతం రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని విమర్శిస్తున్నారు.ఈ కోడ్‌ల కారణంగా కార్మికులపైన పని భారం పెరుగుతుంది. సరైన వేతనాలను తీసుకునే పరిస్థితి ఉండదు. నిర్దిష్ట కాలానికే కార్మికులను నియమించుకునేలా, ప్రొవిడెంట్ ఫండ్ కట్టకుండా యజమాన్యం తప్పించుకునేలా, కార్మికుల ఆరోగ్య భీమా సౌకర్యాలు సన్నగిల్లేలా ఈ కోడ్‌లు పని చేస్తాయి. ముఖ్యంగా కార్మికుల హక్కుల రక్షణకు చాలా కీలకమైన కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కును లాగేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో ఉన్న దాదాపు 20 కోట్ల మంది కార్మికులు ఈనెల 26వ తేదీన సార్వత్రిక సమ్మెలో పాల్గనబోతున్నారు. పది కేంద్ర కార్మిక సంఘాలు, డజన్ల సంఖ్యలో ఉన్న స్వతంత్ర ఫెడరేషన్లు ఉమ్మడిగా దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆర్ఎస్ఎస్‌కి చెందిన భారతీయ మజ్దూర్ సంఘ్? తప్ప మిగిలిన కార్మిక సంఘాలన్నీ సమ్మెకు పిలుపునిచ్చాయి. కార్మిక సంఘాలతో సమన్వయం చేసుకుంటూ ఈనెల 26,27 తేదీల్లో దేశవ్యాపితంగా ఆందోళనలకు దాదాపు 300కు పైగా రైతు సంఘాలు పిలుపు నిచ్చాయి. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి రెండు లక్షల మంది రైతులు నిరసన తెలపడానికి ఢిల్లీకి చేరుకుంటున్నారు. స్టీలు, పోర్టులు, బగ్గు, టెలికమ్, ఇంజనీరింగ్, రవాణా, రక్షణ ఉత్పత్తులు లాంటి ఉత్పాదక రంగ సంస్థలతోపాటు సేవల రంగానికి చెందిన బ్యాంకులు, బీమా సంస్థ కు చెందిన ఉద్యోగులు, కార్మికులంతా ఈనెల 26వ తేదీన సమ్మెలో పాల్గనబోతున్నారు. ప్రభుత్వ స్కీమ్ వర్కర్లయిన ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఎఎన్ఎమ్‌లతోపాటు మహిళా ఉద్యోగులంతా సమ్మెలో పాల్గనబోతున్నారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా రైతులు ఈనెల 26వ తేదీన మొదలు పెట్టి మరుసటి రోజు కూడా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముందు, రాష్ట్ర శాసనసభల ముందు ధర్నా కార్యాక్రమాలను నిర్వహిస్తారు. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో గ్రామీణ బంద్‌ను పాటిస్తారు. ఈ నేపథ్యం లోప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లు సాధించుకునేందుకు కార్మిక వర్గం సమ్మెకు పిలుపునిచ్చింది. కనీస వేతనం 21 వేల రూపాయలకు పెంచాలి, నెలకు పది వేల రూపాయల పెన్షన్, అవసరమున్న కుటుంబాలకు నెలకు పది కేజీల ఆహార ధాన్యాలు, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి, పన్ను కట్టని కుటుంబాలకు నెలకు 7,500 రూపాయల నగదు బదిలీ, లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి, మూడు వ్యవసాయరంగ చట్టాలను ఉపసంహరించాలి, నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించాలి, జీడిపిలో ఐదు శాతం విద్యకు కేటాయించాలి, అందరికీ వైద్యం, అందుకోసం జిడిపిలో ఆరు శాతం కేటాయించాలి, నూతన విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఉపసంహరించాలి, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికులుగా పనిచేసే వారిలో చాలామందికి ఇప్పటికీ గ్రామాల్లోని తమ భూములతో సంబంధాలు కల్గిఉన్నారు. వ్యవసాయ రంగంలో నిరుద్యోగం కారణంగా చాలామంది గ్రామాలను వదిలేసి పట్టణాల్లోకి వెళ్లి కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఆ కారణంగా కార్మికులు, కర్షకులకు విడదీయలేని బంధం ఉంది. ప్రారంభంలో ఎవరికి వారే ఆందోళనలు చేసేవారు. కానీ రానురాను మొండిగా వ్యవహరిస్తున్న మోడీ సర్కారు మెడలు వంచాలంటే కలిసి పోరాటం చేయక తప్పదని లెఫ్ట్ పార్టీల సంఘాలు అంటున్నాయి. అందులో భాగంగానే ఒకే సమయంలో పోరాటాలు చేసేందుకు కార్యాచరణను ప్రకటించాయి. ఈసారి అన్ని కార్మికసంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ, రైతు సంఘాల సమన్వయ కమిటీ కలిసి కూర్చొని పూర్తిస్తాయిలో సమన్వయం చేసుకొని ఈనెల 26,27 తేదీల్లో ఆందోళనలకు పిలుపునిచ్చాయి.

ఈ నెల 25న లఖ్‌నవూ విశ్వవిద్యాలయం శత వార్షిక స్థాపన దినోత్సవానికి హాజరుకానున్న ప్రధాన మంత్రి

హైదరాబాద్,నవంబర్24ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 25న లఖ్‌నవూ విశ్వవిద్యాలయం శత వార్షిక స్థాపన దినోత్సవం లో ఆ రోజు సాయంత్రం 5:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాలుపంచుకోనున్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని 1920వ సంవత్సరం లో స్థాపించడం జరిగింది. ఇది తన 100వ సంవత్సర ఉత్సవాన్ని జరుపుకోనుంది.

ఈ సందర్భంలో విశ్వవిద్యాలయ శత వార్షిక స్మారక నాణేన్ని ప్రధాన మంత్రి ఆవిష్కరించనున్నారు. ఇండియా పోస్ట్ జారీ చేసే ఒక ప్రత్యేక స్మారక తపాలా బిళ్

పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కావాలి

దేశవ్యాప్తంగా రైతుల ఏకైక డిమాండ్ ఇదే

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): తాము పండించిన పంటలకు అయిన ఖర్చు కంటే 50 శాతం అదనంగా కనీస మద్దతు ధరలను ప్రకటించాలని దేశంలోని రైతులు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ విధంగా కనీస మద్దతు ధరలు ప్రకటించాలని 16 ఏళ్ల క్రితం స్వామినాథ్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

రైతుల్లో 50 శాతం మంది అప్పుల్లో కూరుకుపోయి ఉన్నారని, వారి అప్పులన్నీ మాఫి చేయాలని కూడా రైతులు అడుగుతున్నారు. ఈ రెండు చర్యలు తక్షణమే తీసుకొని తిరిగి వ్యవసాయాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరమయింది. లేకుంటే ఇప్పటికే మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు, ఇంకా మరింత మంది ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉత్పన్నమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రూపాల్లో సుదీర్ఘంగా రైతులు చేసిన పోరాటాల కారణంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని కంటితుడుపు చర్యలను తీసుకుంది. రైతులు పెట్టిన ఖర్చుకు 50 శాతం అదనంగా కనీస మద్దతు ధరలు ప్రకటిస్తామని చెప్పింది. పెట్టిన ఖర్చుల్లో కొన్ని అంశాలను మినహాయించి తక్కువ మొత్తాన్ని ఖర్చుగా చూపించింది. ఈ విధంగానే రైతులకు ఏడాదికి ఆరు వేల రూపాయల పంట సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ సహాయం రైతులందరికీ చేరడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలేవి రైతుల ప్రాథమిక సమస్యలను పరిష్కరించలేదు. ఈ ఏడాది కరోనా మహమ్మారి కష్టకాలాన్ని అనుకూలంగా మార్చుకొని కేంద్ర ప్రభుత్వం రైతులకు అత్యంత నష్టదాయకమైన మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. ఈ చట్టాలను ఆమోదించుకునే క్రమంలో కేంద్ర ప్రభుత్వం కనీసం పార్లమెంట్‌లో చర్చ కూడా చేయలేదు. ప్రతిపక్ష సభ్యులను పార్లమెంట్ నుంచి బయటకి పంపేసి చట్టాలను ఆమోదించుకుంది.కనీస మద్దతు ధరకు ఏమాత్రం భరోసా ఇవ్వకపోవడమే కాక కార్పొరేట్ శక్తుల దోపిడికి ఉపయోగపడే ఈ మూడు చట్టాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చట్టాల కారణంగా లాభాపేక్షతో రగిలిపోయే ఈ కార్పొరేట్ శక్తులు ఏ పంటలు పండించాలి, ఎంత మొత్తం పంట కొనాలి, ఏ రేటుకు కొనాలి, ఎంత మొత్తంలో నిల్వ చేయాలి, ఏ రేటుకు అమ్మాలి అనే అన్ని విషయాలను నిర్ణయిస్తాయి. దీంతో దేశవ్యాప్తంగా రైతుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. వరుసగా ఆందోళనల్లో పాల్గన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది రైతులు ఆందోళనల్లో పాల్గన్నారని అఖిల భారత కిసాన్ సభ నాయకులు హనన్ మొల్లా తెలిపారు.ఈ నేపథ్యంలో మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని, అప్పులను రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈనెల 26,27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించబోతున్నారు.

తుంగభద్ర నదికి గంగా హారతి

పాల్గొన్న ఎమ్మెల్సీ దంపతులు

మహబూబ్‌నగర్,నవంబర్23 (ఆర్ఎన్ఎ): మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్‌లో తుంగభద్ర నదీ పుష్కరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో శక్తిపీఠం జోగులాంబ అమ్మవారి ఆలయం ఉండటంతో ఇక్కడి ఘాట్‌కు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు వచ్చి పుష్కర స్నానం చేస్తున్నారు. గత మూడు రోజులుగా భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా నాలుగురోజు కార్తీక సోమవారం కావడం పొటెత్తారు. తెల్లవారు జామునే నదిలో స్నానం చేసి కార్తీక దీపాలు వదిలారు. సాయంత్రం ఆలయ అర్చకులు తుంగభద్ర నదికి గంగా హారతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్రహం దంపతులతోపాటు ఆలయకమిటీ చైర్మన్ రవికుమార్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుంగభద్ర పుష్కరాలు నవంబర్ 20 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే.

పాక్ ఖైదీలు విడుదల: వాఘా వద్ద పాక్‌కు అప్పగింత

లూథియానా,నవంబర్24(ఆర్ఎన్ఎ): వివిధ జైళ్లలో శిక్ష పూర్తిచేసుకున్న 25 మంది పాకిస్థాన్ ఖైదీలను అధికారులు విడుదలచేశారు. ప్రత్యేక భద్రత నడుమ వారిని స్వదేశానికి పంపించారు. ఇందులో 20 మంది మత్స్యకారులు ఉన్నారని అధికారులు తెలిపారు. వారిని పంజాబ్‌లోని అట్టారీ-వాఘా సరిహద్దుల్లో పాక్ అధికారులకు అప్పగించారు. పాక్‌కు పంపిన 25 మంది ఖైదీల్లో 20 మంది మత్స్యకారులు ఉన్నారని, వారు పొరపాటున భారత్‌లోకి ప్రవేశించారని ప్రొటోకాల్ ఆఫీసర్ అరుణ్‌పాల్ సింగ్ తెలిపారు. వారి జైలు శిక్ష పూర్తయ్యిందని, దీంతో వారిని విడుదల చేశామన్నారు. వారితోపాటు మరో ఐదుగురిని వాఘా సరిహద్దుల్లో పాకిస్థాన్ అధికారులకు అప్పగిస్తున్నామని చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా: ఇద్దరు మృతి

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్24 (ఆర్ఎన్ఎ): జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గుండాల మండలం ముత్తాపురంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి పూనెం వసంతరావు (22), పూనెం బుచ్చయ్య (65) అనే ఇద్దరు గ్రామ పంచాయతీ సిబ్బంది మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. ముత్తాపురం-2 గ్రామంలో రోడ్డు వెంట ఉన్న మొక్కలకు ట్రీ గార్డ్ వేసేందుకు వెళ్తున్న క్రమంలో రాజేష్ అనే డ్రైవర్ ట్రాక్టర్ నడుపుతుండగా డాక్టర్ ట్రక్కులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడి ట్రక్కులో ఉన్న వసంతరావు అక్కడికక్కడే మృతిచెందగా, బుచ్చయ్యను చికిత్స కోసం ఇల్లందుకు 108 వాహనంలో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ముత్యం రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుజరాత్‌లో దారుణ ఘటన

గర్భిణితో సహజీవనం.. ఆపై హత్య
పొలంలో పాతిపెట్టిన దుండగుడు
హత్యకేసులో నిజాలు రాబట్టిన పోలీసులు

అహ్మదాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): భర్తతో విభేదాలు వచ్చి విడిపోయి దూరంగా బతుకుతున్న ఓ గర్భిణిపై ఓ కామాంధుడు కన్నేశాడు. నీ కష్టంలోను సుఖంలోనే తోడుగా ఉంటాను..నీకు అండగా నేనున్నానని నమ్మించాడు. అన్ని రకాలుగా వాడుకున్నాడు. ఆ తరువాత ఆమెను వదిలించుకోవటానికి గర్భిణి అని కూడా చూడకుండా కిరాతకంగా హత్య చేసి జేసీబీతో గొయ్యి తవ్వి ఫామ్‌హౌస్‌లో పాతిపెట్టేసిన ఘటన గుజరాత్ లోని బర్దోలీలో సోమవారం రాత్రి బయటపడింది. .బర్దోలీకి చెందిన రష్మీ కటారియా అనే మహిళ గత కొంతకాలంగా భర్తకు దూరంగా ఉంటోంది. ఆమె ఐదు నెలల గర్భవతి. అప్పటికే మూడేళ్ల కొడుకు కూడా ఉన్నాడు. ఒంటరిగా ఉంటున్న రష్మీపై ఆమె ఇంటి సమీపంలోనే ఉంటున్న చిరాగ్ పటేల్ అనే వ్యక్తి కన్నేశాడు. భర్తకు దూరంగా ఉండటాన్ని అవకాశంగా తీసుకున్నాడు. ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఫ్రెండ్ అంటూ చేరాడు. తోటి మనిషి మనిషి సహాయం చేసుకోవాలంటూ మాయమాటలు చెప్పాడు. చిన్న చిన్న అవసరాలు తీర్చేవాడు. అలా అతను మంచివాడని నమ్మింది రష్మీ. అతన్ని పూర్తిగా నమ్మిన రష్మీ అతనితో జీవితం పంచుకోవాలనుకుంది. దీంట్లో భాగంగా ఇద్దరూ దగ్గరయ్యారు. కొంతకాలం రష్మీని చిరాగ్ నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. తరువాత ఆమెను వదిలించుకోవాలనుకున్నాడు. కానీ ఇవేమీ తెలియని రష్మీ అతన్ని పూర్తిగా నమ్మింది. గత ఆదివారం రాత్రి రష్మీ తన మూడేళ్ల కొడుకుని తన తల్లి ఇంటిలో ఉంచి వెళ్లింది. కానీ మళ్లీ తిరగిరాలేదు. తెల్లారింది. కానీ కూతురు తిరిగి రాకపోవటంతో రష్మీ తల్లి అనుమానం వచ్చింది. రష్మీ ఎంతకూ తిరిగి రాకపోవడంతో భయపడిన ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రష్మీ కోసం వెదికారు కానీ కనిపించలేదు. దీంతో ఎవరిమీదైనా అనుమానం ఉందాని అడగటంతో ఇటీవల కూతురుతో కలిసి ఉంటున్న చిరాగ్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. తన కుమార్తె అతనితో గతకొంత కాలంగా సహజీవనం చేస్తోందని.. ఆదివారం వచ్చి వెళ్లిన తను కూతురు అప్పటి నుంచి కనిపించట్లేదని చెప్పారు. దీంతో చిరాగ్‌ను అదుపు లోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. సంచలన విషయాలను వెల్లడించాడు చిరాగ్. రష్మీని హత్య చేసి జేసీబీతో గొయ్యి తీసి తన తండ్రి ఫాంహౌస్‌లో పూడ్చిపెట్టానని చెప్పాడు. ఇద్దరి మధ్య కొన్ని రోజుల నుంచి విభేదాలు వచ్చాయని పెళ్లి చేసుకోమని ఒత్తిడి తెచ్చిందనీ అందుకే ఆమెను వదిలించు కోవటానికి హత్య చేశానని ఒప్పుకున్నాడు. దీంతో అప్పటి వరకూ రష్మీని మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు చిరాగ్ పై హత్య చేసు నమోదు చేశారు. అలాగే అప్పటికే చిరాగ్‌కు వివాహం అయిందని తెలుసుకుని చిరాగ్ భార్యపై కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆమె రష్మీపై దాడి చేసిందని తమ దర్యాప్తులో తేలింది. ఈ హత్యలో ఆమె పాత్ర కూడా ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మరోవైపు ఘటనాస్థలిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు.. పోస్ట్‌మార్టం నిమిత్తం సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిలుకానగర్ అభివృద్ధి నా బాధ్యత : మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్‌ను దత్తత తీసుకొని ఒక మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తానని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి గీత ప్రవీణ్ ముదిరాజ్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను కూడా చిలుకానగర్ నివాసినేనని, దీనిని అభివృద్ధి చేయడంలో తనకు కూడా బాధ్యత ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చిలుకానగర్ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ప్రచారంలో పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నిరంజన్ భాస్కర్, చిలుకానగర్ తాజా మాజీ కార్పొరేటర్ గోపు సరస్వతి సదానందం గౌడ్, జిల్లీ మోహన్, ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రేర్ మేనిఫెస్టో విడుదల

గెలిస్తే వరదబాధితులకు 50వేల సాయం
టిఆర్ఎస్ మేనిఫెస్టోను చిత్తు కాగితంగా తేల్చిన ఉత్తమ్

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోను విడుదల చేసింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆ పార్టీ నేతలు మాణిక్యం ఠాగూర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క విడుదల చేశారు. వరద బాధితులకు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తామని హామీగా ప్రకటించేశారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.2.5 లక్షల నుంచి 5 లక్షల సాయం అందజేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుం బాలకు రూ. 25 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించింది. ఎంఎంటీఎస్, మెట్రోల్లో దివ్యాంగులు, మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపింది. మెట్రో సేవలు పాతబస్తీ నుంచి ఎయిర్‌పోర్టు వరకూ పొడిగిస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని వెల్లడించింది. 80 గజాలలోపు ఉన్న భూముల్లో ఇల్లు కట్టుకున్నవారికి ఆస్తి పన్ను రద్దు అని ప్రకటించింది. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ లేకుండా చేస్తామని తెలిపింది. ధరణి పోర్టల్ రద్దు, ప్రతి కుటుంబానికి 30 వేల లీటర్ల ఉచిత మంచినీరు అందజేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌కు చేసిందేమి లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. లక్ష ఇళ్లు అని ఒక్క ఇల్లయినా ఇచ్చారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నేతలు మాటలతో మభ్యపెడుతున్నారే తప్ప.. ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని ఆరోపించారు. మంగళవారం ఆయన ఇందిరా భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో చిత్తు కాగితంతో సమానమని విమర్శించారు. గత ఎన్నికల్లో విడుదల చేసిన మేనిఫెస్టోనే మళ్లీ విడుదల చేశారని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీని, మేనిఫెస్టోని చెత్తబుట్టలో పడేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో చెప్పిన పనులే చేయలేదు.. మళ్ళీ అవే మాటలు చెప్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది. గత ఎన్నికల మేనిఫోస్టోనే మళ్లీ విడుదల చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. దళిత ముఖ్యమంత్రి, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, నిరుద్యోగ భృతి ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. 100 రోజుల ప్రణాళిక, ట్యాంక్‌బండ్ చుట్టూ ఆకాశ భవనాలెక్కడ? కరోన ని ఆరోగ్య శ్రీ లో ఎందుకు చేర్చలేదు? దోభీలకు, సెలూన్లకు ఇప్పటి వరకు ఎందుకు ఉచిత కరెంట్ ఇవ్వలేదు? డ్రైనేజ్ సిస్టం ఎందుకు బాగు చేయలేదు?' అని ఉత్తమ్ ప్రశ్నించారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేసిన ఉత్తమ్, మాణికం ఠాగూర్,భట్టి విక్రమార్క తదితరులు

గుప్త నిధుల తవ్వకాల ముఠా అరెస్ట్

పెద్దపల్లి,నవంబర్24(ఆర్ఎన్ఎ): గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు పట్టకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రం శివాలయం వీధిలోని ఒక పురాతన ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారే విశ్వసనీయ సమాచారం మేరకు పెద్దపల్లి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సిఎం కెసిఆర్ అబద్ధాలకోరు

పాత మేనిఫెస్టోను విడుదల చేసి బురిడీ
పాతబస్తీలో రోహింగ్యాలపై సర్జికల్ స్ట్రయిక్స్
గ్రేటర్ ప్రచారంలో బండి సంజయ్ వ్యాఖ్యలు

హైదరాబాద్,నవంబర్24(ఆర్ఎన్ఎ): అబద్ధాల కోసం మన సిఎం కెసిఆర్ అంటూ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాల మేనిఫెస్టోనే మళ్లీ మార్చి విడుదల చేయడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఇంతవరకు ఎప్పుడూ సీఎం కేసీఆర్ మేనిఫెస్టో విడుదల చేయలేదని.. బీజేపీకి భయపడి మేనిఫెస్టో విడుదల చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉప్పల్,రామంతపూర్‌లలో పార్టీనేత, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ ప్రభాకరతో కలసి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ మాట్లాడుతూ బిజెపి అభ్యర్థులకు పక్కాగా ఓటేయాలని అన్నారు. దలను పట్టించుకోని ముఖ్యమంత్రి నిన్న మొదటిసారిగా మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. అయితే పాత మేనిఫెస్టోనే విడుదల చేశారని, అప్పుడు ఏం చెప్పారో, ఇప్పుడు అదే చెప్పారని విమర్శించారు. అందరినీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా గతంలో విడుదల చేసిన మేనిఫెస్టోను చదివి వినిపించారు. ఇదే సందర్భంలో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాతబస్తీలో రోహింగ్యాలు, పాకిస్తాన్ వాసులు ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ గెలవగానే పాతబస్తీలో సర్జికల్ స్ట్రయిక్ చేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. తన పేరుమీద దొంగ సంతకం పెట్టి బాధితులకు రూ. 10వేలు ఇవ్వకుండా చేసిన సీఎం కేసీఆర్ గురించి ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని బండి సంజయ్ అన్నారు. గ్రేటర్ మహిళల గాజుల శబ్దానికి కేసీఆర్, కేటీఆర్, ఓవైసీ చెవుల నుంచి రక్తం కారాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పు ఇవ్వాలని ఆయన పిలుపు ఇచ్చారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ విజయంసాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు భారీగా ఈ ర్యాలీలో పాల్గొన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కోవిడ్ కేసులు

మొదటి ఆరు నెలల కంటే ఎక్కువగా నమోదు

న్యూఢిల్లీ,నవంబర్24(ఆర్ఎన్ఎ): ప్రాణాంతక మహమ్మారి వల్ల ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఘోరమైన వ్యాధి సోకిన వారు, ఈ మహమ్మారి మొదటి ఆరు నెలల్లో కంటే గత నాలుగు వారాల్లో కోవిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి, యాంటీమైక్రోబయల్ నిరోధకత్వం ద్వారా వచ్చే ముప్పుపై కొత్త నివేదికను ప్రారంభించినఐరాస ఆరోగ్య సంస్థ చీఫ్ శుక్రవారం చెప్పారు. కోవిడ్ 1÷-ఖ9 మహమ్మారి మానవులు, జంతువులు మరియు మేము పంచుకునే గ్రహం మధ్య సన్నిహిత సంబంధం ఒక బెదిరింపు గుర్తుగా ఉంది అని డబల్యూహెచ్యుడీ చీఫ్ తెలిపారు. యూరోప్ మరియు ఉత్తర అమెరికా అంతటా, ఆసుపత్రులు మరియు ఐసియు యూనిట్లు నిండిఉన్నాయి లేదా నిండుగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధానోం ఘెబ్రెస్ శుక్రవారం జెనీవాలో ఒక సాధారణ పత్రికా సమావేశంలో చెప్పారు. వ్యాక్సిన్ లభ్యత గురించి, మహమ్మారిని అంతం చేయాలనే నిరీక్షణను అందించే వ్యాక్సిన్ ట్రయల్స్ నుండి మరిన్ని శుభవార్తలు అతను భాగస్వామ్యం చేశాడు, కానీ అతను మేము వ్యాప్తి గొలుసులను అంతరాయం మరియు ప్రాణాలను కాపాడటానికి కలిగి ఉన్న సాధనాలను ఉపయోగించడం కొనసాగించాల్సిన అవసరం ఉంది. జంతువుల ఆరోగ్యం మరియు మన పర్యావరణ ఆరోగ్యంపై దృష్టి సారించకుండా మనం మానవ ఆరోగ్యాన్ని సంరక్షించలేం మరియు ప్రోత్సహించలేం అని చీఫ్ గుర్తు చేస్తున్నారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అనేది 'మన కాలంలోని గొప్ప ఆరోగ్య ముప్పుల్లో ఒకటి'. ఇది హెచ్ఐవీ, మలేరియా, నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధులు మరియు అనేక ఇతర అనారోగ్యాలను ఎదుర్కోవడంలో కీలకంగా ఉండే యాంటీబయాటిక్స్ యొక్క సమర్థతను దెబ్బతీస్తుంది. బుధవారం నుంచి ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవేర్ నెస్ వీక్ ప్రారంభం కానుంది. చీఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ యానిమల్ హెల్త్ లతో కలిసి ఒక కొత్త నివేదికను ప్రారంభించారు, ఇది యాంటీమైక్రోబయల్ విధానాలను పరిపాలించే అంతర్జాతీయ నియమాలను పరీక్షిస్తుంది, మరియు మానవులు, జంతువులు మరియు మొక్కలపై వాటి ఉపయోగాన్ని నియంత్రించే నిబంధనలలో అంతరాలను గుర్తిస్తుంది.

వ్యవసాయ అనుబంధ రంగాలు అభివృద్ధి చెందాలి

నల్లగొండ, నవంబర్ 24: రైతులు వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో అభివృద్ధి సాధించాలి అని పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ సెక్రటరీ అనితారాజేశ్ అన్నారు. మంగళవారం డిండి ప్రాజెక్టులో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి 3.50 లక్షల రొయ్య పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా స్థానిక పశువుల దవాఖాన వద్ద ఏర్పాటు చేసిన పశుపోషకుల అవగాహన కార్యక్రమంలోనూ ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యసంపద అభివృద్ధికి కృషి చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను వదులుతున్నామని తెలిపారు. అవకాశం ఉన్నచోట రొయ్యలను కూడా వదులుతున్నట్లు, ఈ సంవత్సరం డిండి ప్రాజెక్ట్ నుంచి రొయ్యల విడుదల ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వ్యావసాయంతో పాటు దాని అనుబంధ రంగాలు పాలు, కోళ్లు, చేపలు, గొర్రెలు పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలన్నారు. ప్రకృతి అనుకూలించక పంట నష్టం జరిగినా రైతును వ్యవసాయ అనుబంధ రంగాలు ఆదుకుంటాయని తెలిపారు. కాబట్టి రైతులు వ్యవసాయం తోపాటు దాని అనుబంధ రంగాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తున్నది. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె.పాటిల్ మాట్లాడుతూ... డిండి ప్రజల చిరకాల కోరిక నెరవేరింది అన్నారు. డిండిలో పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 50 లక్షల వ్యయం అయ్యే ఈ కేంద్రాన్ని నార్ముల్ ఎండీ రమేష్ కు 10 లక్ష ల చెక్‌ను సెక్రటరీ చేతుల మీదుగా అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ వంగాల లక్ష్మారెడ్డి , ఎంపీపీ సునీత, జిల్లా మత్స్య అధికారి చరిత, ఆర్డీవో గోపిరామ్, తదితరులు పాల్గొన్నారు.

రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్ ప్రారంభించిన రేడియో సిటీ

హైదరాబాద్, నవంబర్ 24 : భారతదేశంలో సుప్రసిద్ధ రేడియో నెట్‌వర్క్ రేడియో సిటీ , భారతదేశపు ప్రతిభావంతులైన గాయకులను వెలుగులోనికి తీసుకువచ్చే తమ వారసత్వం ముందుకు తీసుకువెళ్తూ ఇప్పుడు రేడియోపై భారతదేశపు అతిపెద్ద సింగింగ్ టాలెంట్ హంట్ ? రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. సుప్రసిద్ధ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఆయన స్వరపరిచిన 'ఎన్ఆర్ కళ్యాణమండపం' సంగీతాభిమానుల ప్రశంసలను అందుకుంది. త్వరలోనే ఆ చిత్రం విడుదల కానుంది. ఆయన హైదరాబాద్, వైజాగ్‌లలో పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. రేడియో సిటీ సూపర్ సింగర్ ద్వారా, ఈ రేడియో ఛానెల్ ఔత్సాహిక గాయనీగాయకులకు తమ ప్రతిభను వెల్లడి చేసుకునేందుకు ఓ వేదికను దేశంలోని 39 నగరాలలో అందిస్తుంది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రేడియో సిటీ ఇప్పుడు తమ రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్‌ను సోషల్ మీడియా, రేడియో ద్వారా నిర్వహించబోతుంది. ఈ పోటీలు 20 డిసెంబర్ 2020వ తేదీ ముగుస్తాయి.

ఈ పోటీలకు ఆడిషన్స్ 23 నవంబర్ 2020వ తేదీన ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఔత్సాహిక గాయనీగాయకులు తమ ఎంట్రీలను 06 డిసెంబర్ 2020వ తేదీ లోపుగా ఐఆర్‌వీఎస్, రేడియో సిటీ యొక్క మైక్రోసైట్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా పంపాల్సి ఉంటుంది. ఈ ఆడిషన్స్ తరువాత, ప్రతి భాషలోనూ ఐదుగురు పోటీదారులను వరుసగా హిందీ, తమిళం, తెలుగు మరియు కన్నడ భాషల నుంచి సుప్రసిద్ధ న్యాయనిర్ణేతలు కైలాష్ ఖేర్, స్వరకర్త జిబ్రాన్, సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ మరియు గాయకుడు ఆల్ ఓకే ఎంపిక చేయనున్నారు. ప్రతి రీజియన్‌నుంచి ఐదుగురు రేడియో సిటీ సూపర్ సింగర్ 12 టైటిల్ గెలుచుకోవడానికి పోటీపడతారు. హైదరాబాద్ మరియు వైజాగ్‌లో పోటీదారులను పబ్లిక్ ఓటింగ్ ద్వారా సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ ఎంచనున్నారు.

రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ ఎడిషన్ ప్రారంభం గురించి రేడియో సిటీ ? చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అషిత్ కుకియన్ మాట్లాడుతూ "ఈ కష్టకాలంలో ప్రజల నడుమ సంతోషం మరియు సానుకూలతను విస్తరించే లక్ష్యంతో, మేము మా ప్రతిష్టాత్మక కార్యక్రమం రేడియో సిటీ సూపర్ సింగర్ సీజన్2తో రావాలని నిర్ణయించుకున్నాం. రేడియో సిటీ ఎల్లప్పుడూ కూడా సంక్షోభ సమయంలో కూడా నగరం మరియు దాని ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అవకాశాలను అందించడాన్ని విశ్వసిస్తుంటుంది. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే రేడియో సిటీ యొక్క అచంచలమైన నిబద్ధత గత 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం వృద్ధి చెందడంలో సహాయపడుతుంది. ఇప్పుడు